V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..
శనివారం
25-05-2024
సంపుటి : 01 । సంచిక : 22 । పేజీలు : 08 । వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


Ln. డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB



## మల్లారెడ్డి చుట్టూ భూవివాదాల ఉచ్చు

### బీఆర్ఎస్ మాజీ మంత్రికి వరుస షాక్‌లు

- సుచిత్ర వివాదం ముగియక ముందే మరో పంచాయితీ
- బొమ్మరాశి పేట పెద్ద చెరువు భూమి ఆక్రమించారని ఫిర్యాదులు
- ఎఫ్‌టీఎల్ నిర్మాణం అంటూ కూల్చివేసిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- మొన్న మైసమ్మగూడలో కాలేజీ రోడ్డు నిర్మాణం తొలగింపు..
- నిన్న దుండిగల్ కళాశాలలో ఎఫ్టీఎల్ నిర్మాణాల కూల్చివేత
- నేడు శామీర్ పేట మండలంలో ఆరు ఎకరాల భూవివాదం
- గతంలోనూ 47 ఎకరాల ఎస్టీల భూవివాదంపై కేసు నమోదు
- మల్లారెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేసిందా..?

**విశ్వంభర, మేడ్చల్:**

మంత్రిగా మేడ్చల్ జిల్లాను శాసించిన మల్లారెడ్డికి భూకష్టాలు చుట్టుముట్టాయి. ఒకదాని తర్వాత మరొకటి ఆయనకు చెందిన భూములపై వివాదాలు తలెత్తుతున్నాయి. మల్లారెడ్డి భూములే కాకుండా ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భూములపై కబ్జా ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో గత పది రోజులుగా ఏదో ఒక ప్రాంతంలో వీరిద్దరికి చెందిన భూములపై వివాదం చెలరేగుతూనే ఉంది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వెలుగులోకి రాని మల్లారెడ్డి భూముల వివాదం తప్పిదాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం మారగానే ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నాయి. మైసమ్మగూడలో మల్లారెడ్డి కళాశాలకు అక్రమంగా రోడ్డు నిర్మించారని హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. అదే కాకుండా దుండిగల్‌లో మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన కాలేజ్‌లో ఎఫ్టీఎల్ లో నిర్మాణాలంటూ అధికారులు కూల్చివేశారు. అలాగే సుచిత్రలో జరిగిన భూ వివాదంపై ఏకంగా మామఅల్లుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**పెద్ద చెరువులో నిర్మించిన అక్రమ కట్టడాలు కూల్చివేత**

ఇంతటితో ఆగని అధికారులు శుక్రవారం శామీర్ పేట్ మండలం, బొమ్మరాసిపేట పెద్ద చెరువులో నిర్మించిన అక్రమ కట్టడాలపై మిగతా2లో...



## ఈసీ గ్రీన్ సిగ్నల్

### తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ నిర్వహణకు ఈసీ అనుమతి

**ఏర్పాట్లపై సీఎస్ శాంతకుమారి సమీక్ష**

- వేడుకలకు వేదికకానున్న పరేడ్ గ్రౌండ్
- ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఆదేశం
- గన్ పార్క్ వద్ద సీఎం రేవంత్ నివాళితో కార్యక్రమం స్టార్ట్

**విశ్వంభర, హైదరాబాద్ మే 24:**

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఈసీ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్ 2న తొలిసారి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకులను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి భావించింది. పైగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది. దీంతో.. ఈ వేడుకులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈసీ నుంచి అనుమతి వస్తుందా? రాదా? అనే ఉత్కంఠకు తెరదించుతూ కేంద్ర మిగతా2లో...

## నాకు రాజకీయాల కంటే ధర్మమే ముఖ్యం

- బీజేపీ కార్యకర్తలంతా రాముని వారసులు
- ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశారు
- కారు లోన్ కట్టలేని కేసీఆర్ వేల కోట్లకు అధిపతి అయ్యాడు
- ప్రేమేందర్ రెడ్డి 40 ఏళ్లుగా సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి
- ప్రేమేందర్ రెడ్డి ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు
- కోదాడ ఆత్మీయ సమ్మేళన సమావేశంలో బండి సంజయ్



2

### రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తే

## బీజేపీ ఆఫీస్‌ను ముట్టడిస్తాం

- కిషన్ రెడ్డి సోది చెప్పే స్థాయికి వెళ్లారు
- మోడీ చెప్పే అబద్దాలనే కిషన్ రెడ్డి వల్లే వేస్తుండు
- కాంగ్రెస్, ఆప్ పార్టీలు కలిసి ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటు
- రాహుల్ గాంధే ప్రధాని అని దేశ ప్రజలు డిసైడ్
- గాంధీభవన్‌లో మీడియాతో కాంగ్రెస్ నేత మల్లు రవి

**విశ్వంభర, హైదరాబాద్ :**

హిట్లర్ కేబినెట్‌లో గోబెల్ ఉన్నట్లే మోడీ కేబినెట్‌లో కిషన్ రెడ్డి ఉన్నారని, మోడీ చెప్పే అబద్ధాలనే కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి విమర్శించారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

మిగతా2లో...

## అన్నదాత అరిగోస..

- రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షణ
- కొర్రీల పేరుతో కొనుగోళ్లలో జాప్యం
- ఉన్నతాధికారుల చోద్యం

**విశ్వంభర, నల్లగొండ, బ్యూరో :**

ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతలు తమ పంటను అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. వడ్లు మొలక పోసిన దగ్గరి నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి.. మిల్లులో దిగుమతి అయ్యే దాక అన్నదాతది ఊరికొయ్య మీద ఊగిసలాటే అయ్యింది. ప్రకృతి వైపరీత్యాలు.. మానవ తప్పిదాలు.. కారణం మిగతా2లో...





**టీఎస్ఎప్ సెట్ కౌన్సెలింగ్**

## షెడ్యూల్ విడుదల

- మూడు విడుతల్లో జరగనున్న కౌన్సెలింగ్
- జూన్ 27 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం
- జూన్ 30న మొదటి విడుత వెబ్ ఆప్షన్లకు అవకాశం
- ఆగస్టు 5న తుది విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

2



## ఏలేటిపై కేసు నమోదు

- హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- యూ ట్యాక్స్ ఆరోపణలపై కాంగ్రెస్ నేతల సీరియస్
- ఉత్తమ్ కుమార్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేశారని ఫైర్
- ఏలేటిది పచ్చి అవకాశవాద రాజకీయమని మండిపాటు

2

## మేడిగడ్డకు తాత్కాలిక మరమ్మతులు షురూ

- ఏరియా క్లియరెన్స్ పనులు చేస్తున్న ఇంజినీర్లు
- కుంగిన ఏడో బ్లాక్ వద్ద మరమ్మతులు ప్రారంభం
- 20వ పియర్ ప్లాట్ ఫాం ఎదుట బయటపడ్డ బుంగ
- బుంగలను గుర్తించి పూడ్చివేస్తున్న అధికారులు

2



## రేవంత్‌ను జైల్లో ఎందుకు పెట్టకూడదు?

### సోషల్ మీడియాలో ప్రశ్నించిన కేటీఆర్

- సీఎం సిగ్గులేని అబద్ధం చెప్పాడంటూ ఫైర్
- 'ఎక్స్'లో పలు ప్రశ్నలు సంధించిన మాజీ మంత్రి



2

# రేవంత్‌ను జైల్లో ఎందుకు పెట్టకూడదు?



**విశ్వంభర, హైదరాబాద్:** అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కాంగ్రెస్ సర్కార్‌ను ఎప్పటికప్పుడు నిలదీస్తూనే ఉంది. మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు తమదైన శైలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ బంధువు రూ.10వేల కోట్ల కోవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందంటూ ఆరోపించారు. దీనిపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. అసత్య ప్రచారాలకు అలవాటు పడిన సీఎం రేవంత్ రెడ్డిని జైల్లో ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలను సంధించారు. 'నా బంధువుకు రూ.10,000 కోట్ల కోవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని రేవంత్ సిగ్గులేని అబద్ధం చెప్పాడు. అదే జోకర్ నేను సెక్రటేరియట్ కింద ఉన్న నిజాం ఆభరణాలను తవ్వినట్లు నకిలీ కథనాన్ని సృష్టించాడు. కేంద్ర హోం మంత్రికి సంబంధించిన ఫేక్ వీడియోను రేవంత్ సర్క్యులేట్ చేశారు. సీఎం అయినందున ఓయూకి సంబంధించిన నకిలీ సర్క్యులర్ పోస్ట్ చేశాడు' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్ న్యూస్ స్ప్రెడర్‌ను ఎందుకు జైల్లో పెట్టకూడదంటూ కేటీఆర్ రాసుకొచ్చారు.

# ఏలేటిపై కేసు నమోదు

**విశ్వంభర, హుజూర్ నగర్:** తెలంగాణ ప్రభుత్వంపై, మంత్రులపైనా బీజేపీ ఎల్పీ నేతల ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన కామెంట్స్ వివాదస్పదంగా మారాయి. ఆయన ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఏలేటి చేసిన ఆరోపణలకు ఆధారం లేదని పలు పోలీస్ స్టేషన్లలో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో కేసు నమోదైంది. మహేశ్వర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత ఎరగని నాగన్న గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోసారి ఇలాంటి ఆరోపణలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నేతలపై వరుసగా ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి ఆధారాలు ఉంటే చూపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. యూ ట్యాక్స్ అంటూ నిరాధార ఆరోపణలు చేసిన మహేశ్వర్‌రెడ్డి వెంటనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ద్వారా పదవులు పొంది, పార్టీ మారగానే ఆయనను విమర్శించడం పచ్చి అవకాశవాద రాజకీయమని మండిపడుతున్నారు.

# టీఎస్ ఎప్ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం టీఎస్ ఎప్‌సెట్ పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తెలంగాణ ఉన్నత విద్యామండలి శుభవార్త చెప్పింది. ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబందించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. మొత్తం మూడు విడుతల్లో ప్రవేశాల ప్రక్రియ జరగనుంది. తొలి విడుత జూన్ 27 నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. 27 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొదలు కానుండగా జూన్ 30న విద్యార్థులకు మొదటి విడుత వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. జూలై 12న మొదటి విడుత సీట్ల కేటాయింపు ఉండనుంది.అనంతరం రెండో విడుత కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై 19 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన సీట్ల కేటాయింపు జూలై 24న చేపట్టనున్నారు. ఇక తుది విడుత కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై 30న నిర్వహించనుండగా.. సీట్ల కేటాయింపు ఆగస్టు 5న చేయనున్నారు. మరింత సమాచారం కోసం టీజీఈఏపీసెట్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని తెలిపింది. ఈ ఏడాది జరిగిన టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలో ఇంజినీరింగ్ పరీక్షను 2,54,814 మంది విద్యార్థులు రాశారు. పరీక్షకు హాజరైన వారిలో 74.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిలు 74.38 శాతం, అమ్మాయిలు 75.85 శాతంగా ఉంది.

**ముఖ్యమైన తేదీలు ఇవే..**

- జూన్ 27 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ
- జూన్ 30 నుంచి మొదటి విడత వెబ్ ఆప్షన్లు
- జూలై 12న మొదటి విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు
- జూలై 19 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్
- జూలై 24న ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు
- జూలై 30 నుంచి ఇంజినీరింగ్ తుది విడత కౌన్సెలింగ్
- ఆగస్టు 5న తుది విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

# మేడిగడ్డకు తాత్కాలిక మరమ్మతులు షురూ



**విశ్వంభర, భూపాలపల్లి:** మేడిగడ్డ బ్యారేజీ తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా అధికారులు పనులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కుంగిన ఏడో బ్లాక్ వద్ద ఏరియా క్లియరెన్స్ పనులను సాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో డివాటరింగ్ చేయగా 20వ పియర్ ఫ్లాట్‌పాం ఎదుట బుంగ బయటపడింది. బుంగను ఇంజినీరింగ్ అధికారులు గుర్తించి మట్టి పోసి పూడ్చివేశారు. ఏడో బ్లాక్ ప్రదేశంలో పలు చోట్ల చిన్నపాటి బుంగలు ఏర్పడగా, అధికారులు గుర్తించి పూడ్చివేసినట్లు తెలుస్తోంది. బ్లాక్ 7లో మొత్తంగా 11 గేట్లు ఉండగా ఎనిమిది గేట్లపై ప్రభావం ఉండటంతో వాటిని మూసేశారు. ఎన్డీఎస్ఏ కమిటీ, నిపుణుల సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 15వ గేటును ఎత్తారు. 16 నుంచి 22 గేట్ల వరకు ఎత్తివేతలో భాగంగా గేట్లకు ఉన్న బోల్టులు, తదితర సామగ్రి భాగాలను తీసివేసి పనులను చేస్తున్నారు. 16వ గేటును ఎత్తడానికి సిద్ధమవగా, ఎదురయ్యే సమస్యలు, సాధ్యసాధ్యాలపై పరిశీలన చేస్తున్నారు. గేట్ల ఎత్తివేత ప్రక్రియ సంబంధిత నిపుణుల పర్యవేక్షణలోనే జరగనుంది. ఏడో బ్లాక్ ప్రాంతంలో షీట్ ఫైల్స్ పనుల చేయడానికి కసరత్తు చేస్తున్నారు. బ్యారేజీ దిగువన సీసీ బ్లాక్ అమరిక పనులు ప్రారంభించారు.

# మల్లారెడ్డి చుట్టూ భూవివాదాల ఉచ్చు



**(మొదటిపేజీ తరువాయి)**
కొరఢా ఝులిపించారు. సర్వే నెంబర్ సర్వేనెంబర్ 315, 407, 48లలో మల్లారెడ్డికి ఆరు ఎకరాల భూమి ఉంది. అక్కడ ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ప్రహరీని తాజాగా అధికారులు కూల్చివేశారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా జేసీబీలతో వెళ్లి చెరువులో నిర్మించిన ప్రహరీ గోడలను కూల్చివేశారు. వీటితోపాటు పెద్ద చెరువును అక్రమించి నిర్మించిన మరికొన్ని నిర్మాణాలను కూడా అధికారులు కూల్చేశారు.

**మాజీ మంత్రిని వెంటాడుతున్న భూ వివాదాలు..**
కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామంలోని సుచిత్ర పరిధిలోని సర్వేనెంబర్ 82, 83లో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య భూ వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. అయితే మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి మాత్రం రెండున్నర ఎకరాల భూమి తమదేనని వాదిస్తున్నారు. 1.11 ఎకరాల భూమి తమదని మరో 15 మంది చెబుతున్నారు. వారం రోజుల క్రితం సర్వే నెం.82లోని స్థలంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడు, మరో 15 మంది మధ్య వాగ్వాదం జరిగింది. ఒక్కొక్కరు 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేశారని 15 మంది పేర్కొనగా, కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే ఈ స్థలంపై కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఆ స్థలంలో ఎలాంటి గొడవలు జరగవద్దని పోలీసులు ఇరువర్గాలకు సూచించారు. అయినా మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి తమ అనుచరులతో ఫెన్సింగ్ కూలగొట్టడంతో పోలీసులు వారిద్దరిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని ఆ భూవివాదంలో ఉన్న 15 మంది సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇదే కాకుండా మేడ్చల్ మల్కాజిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని సర్వే నెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుటల ఎస్టీల వారసత్వ భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని అనుచరులు 9 మంది భూమిని కాజేశారని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

**కాంగ్రెస్ ప్రభుత్వం మల్లారెడ్డిని టార్గెట్ చేసిందా..?**
సీఎం రేవంత్ రెడ్డికి, మాజీ మంత్రి మల్లారెడ్డికి పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా గొడవలు ఉన్నాయి. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, ఆ జిల్లా మంత్రిగా ఉన్న మల్లారెడ్డి మధ్య తగ్గపోరు నడిచింది. జవహర్ నగర్‌లో తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్పత్రి కట్టారని, సురారంలో చెరువు కబ్జా చేసి ఆస్పత్రి కట్టారని రేవంత్ అప్పట్లో ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసి, ఆస్పత్రి, కాలేజీ కట్టాడని.. మల్లారెడ్డి వర్సిటీకి అనుమతి వచ్చిన భూమి కూడా దొంగ భూమి అని ఆరోపణలు చేశారు. రేవంత్ ఆరోపణలపై ఆ సమయంలో మల్లారెడ్డి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ మాదిరిగా బ్రోకరిజం చేసి పదవి తెచ్చుకోలేదని విరుచుకుపడ్డారు. రాజకీయాల్లోకి రాకముందే తమ విద్యాసంస్థలకు 600 ఎకరాల భూమి ఉందని వివరించారు. అందులో కబ్జా భూమి లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవికి రాజీనామా చేసి పోటీ చేద్దాం.. ఎవరు గెలిస్తే వారు హీరో అని తొడగొట్టి మరి మల్లారెడ్డి సవాల్ చేశారు. డైలాగ్ వార్ అలా కొనసాగింది. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం.. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం తెలిసిందే. ఈక్రమంలోనే మల్లారెడ్డి భూ దందాలపై టీ సర్కార్ ఫోకస్ చేసినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ వివాదాలకు ఎక్కడ, ఎప్పుడు ఫులిస్టాప్ పడుతుందో చూడాలి.

# ఈసీ గ్రీన్ సిగ్నల్

**(మొదటిపేజీ తరువాయి)**
ఎన్నికల కమిషన్ శుక్రవారం అనుమతి ఇచ్చింది.

**సీఎస్ శాంతకుమారి సమీక్ష**
ఈ నేపథ్యంలో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సెక్రటేరియట్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు.సభా ప్రాంగణం పరిసర పారంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణతోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, ముఖ్య కార్యదర్శులు బీ వెంకటేశం, జితేందర్, కార్యదర్శులు క్రిస్టినా జోంగ్తు, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, సీడీఎంఏ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తే

**(మొదటిపేజీ తరువాయి)**
ఆగస్టు 15 లోపే రైతు రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తానని సీఎం రేవంత్ చెప్పారని, అందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రుణమాఫీ చేస్తారని రైతులకు, బీజేపీ నాయకులకు నమ్మకం ఉందని, కానీ రుణమాఫీ చేయరని అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపట్టారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు అవుతున్న సంగతి బీజేపీకి తెలియదా..? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ నాయకులు సోది చెప్తుతున్నారని, కిషన్ రెడ్డి కూడా సోది చెప్పే స్థాయికి వెళ్లారన్నారు. తెలంగాణలో రాజకీయ పున:రేకీకరణ జరుగుతుందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్, ఆప్ పార్టీలతో కలిసి ప్రభుతం ఏర్పడబోతుందని చెప్పారు. ఇంకోసారి రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేస్తే బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీకి సన్మానం చేస్తామన్నారు. సోనియా గాంధీ రాకను అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారని, ఈ విషయంలో కిషన్ రెడ్డి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. దేశం వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతుందని, రాహూల్ గాంధీ ప్రధాని చేయాలని ప్రజలు డిసైడ్ అయ్యారని మల్లు జోస్యం చెప్పారు. కేసీఆర్‌కు 2023 డిసెంబర్ లో ప్రజలు సన్మానం చేశారని, మళ్లీ ఆయనకు సన్మానం చేయడమా ? అంటూ వ్యంగ్యస్త్రాలు సంధించారు.

# నాకు రాజకీయాల కంటే ధర్మమే ముఖ్యం

**విశ్వంభర, కోదాడ :** తనకు రాజకీయాల కంటే ధర్మమే ముఖ్యమని రాముని కించపరిచే వారికి ఓట్లు వేయవద్దని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలంతా రాముని వారసులమన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టుబద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా రైతులు, నిరుద్యోగుల, ఉద్యోగుల, మహిళల సమస్యలపై పోరాడింది బీజేపీ నాయకులేనని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కోసం జైలుకెళ్ళి లాఠీ దెబ్బలు తిన్నది తాను తన పార్టీ నాయకులేనని గుర్తు చేశారు. అన్ని వర్గాల కోసం తాము పోరాటం చేస్తే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ మెడలు వంచి ప్రజల పక్షాన పోరాడింది తానేనన్నారు. కేసీఆర్‌కు తనంటే భయమని అందుకే తనపై 109 కేసులు పెట్టించారన్నారు. కార్ లోన్ కట్టలేని కేసీఆర్ కుటుంబం నేడు వేల కోట్ల రూపాయలు సంపాదించిందన్నారు. ప్రస్తుతం టీఆర్ఎస్ పార్టీ రెండవ స్థానం కోసం పోరాడుతుందన్నారు. టీఆర్ఎస్ పార్టీని పెంచి పోషించే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం మేధావులంతా ప్రేమేరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. శాసనసభలో ఆరు గ్యారెంటీ ల అమలు కోసం పోరాడే తమ ఎనిమిది మంది సైనికులు లాంటి ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఒక బీజేపీ కార్యకర్త పది మంది టీఆర్ఎస్ నాయకులతో సమానం అన్నారు.

**కొట్లాడే వీరుడు ప్రేమేందర్ రెడ్డి**
ప్రేమేందర్ రెడ్డి 40 ఏళ్లుగా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి పని చేసే నాయకుడని, న్యాయవాదిగా ఉన్నత విద్యావంతునిగా పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి అని, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన హామీపై కొట్లాడే వీరుడని కితాబు ఇచ్చారు. టీఆర్ఎస్ వాళ్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు తాము వేసుకొని రెండో ఓటు కాంగ్రెస్, కాంగ్రెస్ వాళ్లు మొదటి ప్రాధాన్యత ఓటు తాము వేసుకొని రెండో ప్రాధాన్యత ఓటు బీఆర్ఎస్‌కు వేసుకునేందుకు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.2000 ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, ఆ డబ్బులు తీసకుని పోరాడే బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు . ఉద్యోగులు ఉపాధ్యాయులు న్యాయవాదులు నిరుద్యోగులు పట్టబద్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు బండి సంజయ్ ని ఘనంగా సన్మానించారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొబ్బ భాగ్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర రావు, పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి, పత్తిపాటి విజయ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి, చల్లా శ్రీలత రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, కన్వీనర్ కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, యాద రమేష్ ,నూనె సులోచన, మల్లె బోయిన అంజి యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# అన్నదాత అరిగోస..

**(మొదటిపేజీ తరువాయి)**
ఏదైనా అన్నదాతకు మాత్రం అంతులేని విషాదం మిగులుతోందనే చెప్పాలి. పాలకుల విధానాలకు తోడు అధికార యంత్రాంగం నిర్లక్ష్యం తోడవ్వడంతో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. అవకాశం చిక్కితే.. అన్నదాతలను తమ భుజస్కంధాలపై మోస్తున్నామంటూ ఊకదంపుడు ప్రసంగాలిచ్చే ప్రజాప్రతినిధులు వారిని ఒక ప్రచార అస్త్రంగానే చూస్తున్నారు. ఎవరెన్నీ చెప్పినా.. 'ఉంటే ఊకుంటం.. లేకుంటే వైకుంఠం' అన్న చందంగా పాలకుల పరిస్థితి మారింది. ఫలితంగా అన్నదాతకు అష్టదిక్కుల నుంచి కష్టాలు చుట్టుముడుతున్నాయి. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే వడ్ల రాశులతో పడిగాపులు కాస్తున్నా.. ఇటు పాలకులు గానీ.. అటు అధికారులు గానీ పలకరించిన పాపాన పోలేదనే చెప్పాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం కారణంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలపై 'విశ్వంభర' ప్రత్యేక కథనం.

**యాదాద్రి జిల్లాలో రైతుల ఆందోళన..**
యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మార్కెట్ యార్డులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగకపోవడంతో ఏకంగా కలెక్టరేట్ ఎదుట ఇటీవల ధర్నాకు దిగారు. ఆలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో.. నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ.. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు పోలింగ్ కేంద్రం ఎదుట ఆందోళనకు దిగారు. సకాలంలో పంటను కొనుగోలు చేయకుండా.. నిర్వాహకులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వారు



ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రాల్లో అన్నదాతలకు ఎదురవుతోన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు నెల రోజులు దాటిన డబ్బులు సకాలంలో అందడం లేదు. చాలా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మడం కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్న తమను పట్టించుకోకుండా రాజకీయ నాయకుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని మండిపడ్డారు. వారి ధాన్యంలో కనీసం తేమ శాతం కూడా చూడకుండా హడావుడిగా కొనుగోలు చేశారని ఆరోపించారు. సీరియల్ నంబరు ప్రకారం కొనుగోలు చేయకుండా వెనుక వచ్చిన వారి ధాన్యాన్ని కొంటున్నారనే ఆవేదనతో కాంటాలను ధ్వంసం చేయడంతో అక్కడ ఉద్రిక్తత వాతవారణం నెలకొంది.

**అకాల వర్షం.. తీరని నష్టం..**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా చేతికి అందివచ్చిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే.. ఇక్కడ కొర్రీలు పెట్టి కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేశారు. ఫలితంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. మళ్లీ అధికారులు ధాన్యం తడిసినందుకు క్వింటాలుకు ఎంత కోత విధిస్తారోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో అకాల వర్షం ధాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు చేరింది. వాస్తవానికి ఒక్కో రైతు ధాన్యం తీసుకొచ్చిన నెల రోజుల వరకు కాంటాలు కావడం లేదు. ఎందుకంటే.. గన్నీ సంచుల కొరత, మిల్లర్లు దిగుమతి చేసుకోకపోవడం వంటి కారణాలను ప్రధానంగా చూపుతున్నారు. వాస్తవానికి ప్రతి సీజనులో ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లు పేచీ పెడుతూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం గానీ అధికారులు గానీ మిల్లర్ల సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**కంటి మీద కునుకు లేకుండా..**

గత కొద్ది రోజులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ యార్డుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను చేపట్టింది. కానీ ఇప్పటివరకు చాలా మార్కెట్ యార్డుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు కంప్లీట్ కాలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పూర్తిస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. వడ్లు అమ్మేందుకు మార్కెట్‌కు వచ్చిన అన్నదాతను తేమ, నాణ్యత ప్రమాణాల పేరుతో రకరకాల కొర్రీలు పెడుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా రోజులు దాటవేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన బదులిచ్చేవారు కరువయ్యారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రాఘవాపురంలో శుక్రవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల కంటే ఎన్నికల ముఖ్యమయ్యాయని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# కేటీఆర్‌పై పరువు నష్టం దావా వేస్తా

**మంత్రి జూపల్లి**



**విశ్వంభర, వనపర్తి :** వనపర్తిలో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డి హత్య తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ హత్య వెనక కాంగ్రెస్ నేతలు ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇది ముమ్మాటికి రాజకీయ హత్య అని కేటీఆర్ మండిపడ్డారు. ఆయనతో పాటు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా కాంగ్రెస్ పై ఆరోపణలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హత్య వెనుక ఉన్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అంతేకాదు.. జూపల్లిని బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీధర్ రెడ్డి హత్య కేసులో తనపై వస్తున్న ఆరోపణలను జూపల్లి ఖండించారు. హత్య ఘటనలో తన హస్తం ఉందని కేటీఆర్ ఎలా మాట్లాడటం సమంజసం లేదని అన్నారు. అసలు శ్రీధర్ రెడ్డికి, రాజకీయాలకు సంబంధమే లేదని తేల్చి చెప్పారు. శ్రీధర్ రెడ్డి కుటుంబంలో ఆస్తి తగాదాలు ఉన్నాయని.. ఆయన వల్ల చాలా మంది చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. దీంతో.. ఆయన శత్రువుల ఎవరైనా ఈ పని చేసి ఉండొచ్చని మంత్రి జూపల్లి అనుమానించారు. అంతేకాదు.. మాజీ ఎమ్మెల్యేతో శ్రీధర్ రెడ్డికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయని చెప్పారు. శ్రీధర్ రెడ్డి హత్యపై లోతైన దర్యాప్తు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు తనపై కక్ష కట్టారని ఆరోపించారు. గతంలో జరిగిన ఓ హత్యను కూడా తనకు లింక్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ఆ హత్య కూడా భూ వివాదం వల్లే జరిగిందని క్లారిటీ ఇచ్చారు. గంద్రపల్లి, లక్ష్మీపల్లిలో రెండు హత్యలపై ప్రజలకు వాస్తవాలు తెలుసని అన్నారు. తప్పుడు ప్రచారాలతో తనను ఎవరూ దెబ్బకొట్టలేరని చెప్పారు. ఇంకో సారి ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానని వార్నింగ్ ఇచ్చారు.

# పూణే కారు ప్రమాద ఘటనలో బిగ్ ట్విస్ట్..!



**విశ్వంభర, పూనే :** పూణే కారు ప్రమాద ఘటనలో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కారును నడిపింది తన కొడుకు కాదని డ్రైవర్ అని మైనర్ బాలుడి తండ్రి విశాల్ అగర్వాల్ తెలిపారు. డ్రైవర్ కూడా తానే కారు నడిపినట్లు పోలీసులు ముందు అంగీకరించాడు. మైనర్ స్నేహితులు కూడా డ్రైవరే కారు నడిపాడని చెప్పారు. పుణేలో గత ఆదివారం తెల్లవారుజామున 3.15గంటలకు పోర్స్ కారు వేగంగా వచ్చింది. తన ముందు ఉన్న బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. కారు ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడి స్పాట్‌లోనే మృతిచెందారు. కళ్యాణినగర్ ప్రాంతంలో పబ్‌లో మద్యం సేవించిన 17 ఏళ్ల బాలుడు గంటకు 200 కి.మీ. వేగంగా వెళ్తున్న పోర్షే కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన అనీష్ అవధియా, అశ్విని కోష్ట అనే ఇద్దరు ఐటీ నిపుణులను ఢీకొట్టింది. అశ్విని 20 అడుగుల మేర గాలిలోకి ఎగిరి పడిపోయాడు. అనీష్‌ను ఆగి ఉన్న కారులోకి విసిరివేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిందితుడి తండ్రి రియల్ ఎస్టేట్ డెవలపర్ కొడుకుని పోలీసులు గుర్తించారు. అయితే గంటల వ్యవధిలోనే బెయిల్‌పై బయటికి తెచ్చాడు. నిందితుడికి కోర్టు బెయిల్ మంజూర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో తాజాగా ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. కారు నడిపింది తన కుమారుడు కాదని, తమ డ్రైవర్ అని బాలుడి తండ్రి విశాల్ అగర్వాల్ చెప్పడం పలు విమర్శలకు దారితీస్తోంది. ప్రమాదానికి సంబంధించి వీడియో ఆధారిత సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ ఈ కేసు నుంచి మైనర్‌ను తప్పించేందుకే డ్రైవర్‌ను ఇరికించారనడంలో ఎలాంటి సందేహం లేదని నెటిజన్లు అంటున్నారు.

# గాలిలో గింగిరాలు కొట్టిన హెలికాప్టర్



**విశ్వంభర,కేదార్‌నాథ్ :** కేదార్‌నాథ్‌లో హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ జరిగింది. హెలికాప్టర్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల ఆ హెలికాప్టర్‌ను అత్యవసరంగా దించేశారు. ఎమర్జెన్సీ ల్యాండింగ్‌తో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. హెలిప్యాడ్‌కు దాదాపు 100 మీటర్ల ముందు హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండింగ్ చేయబడింది. పైలట్‌తో సహా ప్రయాణీకులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని హెలికాప్టర్ పైలట్ తెలిపారు. ఇదిలావుండగా, హెలికాప్టర్ సిర్సీ హెలిప్యాడ్ నుండి కేదార్‌నాథ్ ధామ్‌కు వస్తోందని, ఆరుగురు ప్రయాణికులతో ఉందని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా హెలికాప్టర్ 7.05 గంటల ప్రాంతంలో కేదార్‌నాథ్ ధామ్ హెలిప్యాడ్‌కు దాదాపు 100 మీటర్ల ముందు అత్యవసరంగా ల్యాండింగ్ చేయబడిందని ఆయన చెప్పారు. హెలికాప్టర్‌లోని రోటర్‌కు సమస్య తలెత్తడంతో.. క్రిస్టల్ కంపెనీకి చెంది న ఆ హెలికాప్టర్.. హెలిప్యాడ్‌కు దూరంగా ల్యాండ్ అయ్యింది. ఫటా నుంచి కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

# ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

**ఎమ్మార్వో విజయ కుమార్**




**విశ్వంభర, చింతపల్లి మే 24 :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసిల్దార్ విజయ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామని చెప్పారు. చింతపల్లి మండలంలో 1029 మంది పురుషులు, 457 మంది మహిళలు మొత్తం 1486 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరంతా తప్పనిసరిగా ఓటువేసి తమ ఓటు హక్కును వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ బీ యాదయ్య తోపాటు పలువురు ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రాడ్యుయేట్లను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్న మాజిమంత్రి వర్యులు, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి
**– విశ్వంభర, సూర్యాపేట**

## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ

# మరోసారి వాయిదా



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. బెయిల్‌పై మే 27న కౌంటర్ దాఖలు చేయనున్నట్లు సీబీఐ తెలిపింది. అలాగే జూన్ 7న ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు కోర్టుకు వెల్లడించింది. మరోవైపు కవిత బెయిల్ పిటిషన్‌పై ఈడీ కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. అదేవిధంగా ఈడీ అరెస్టు చేసిన విధానం, కేసులో కవిత పాత్ర గురించి దర్యాప్తు సంస్థ చెప్పిన విషయాలపై కోర్టుకు కవిత తరపు న్యాయవాది వివరించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం లోపు కౌంటర్ కాపీని కవిత న్యాయవాదికి మెయిల్ ద్వారా ఇవ్వాలని హైకోర్టు తెలిపింది. సోమవారం రెండు కేసుల్లో కవిత తరపు వాదనలు పూర్తి చేయాలని ఆదేశించింది.

## ఎవరు ఎన్ని కేసులు పెట్టిన

# చివరికి న్యాయమే గెలుస్తుంది

**కొణతం దిలీప్**

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనపై దృష్టి పెట్టింది. అందులో భాగంగానే జిల్లాల మార్పు, టీఎస్ ను టీజీ గా మార్పులు చేర్పులు చేసి అవి వెంటనే అమలు లోకి వచ్చాయి అని పేర్కొంది. అయితే తాజాగా ఆర్టీసీ నకిలీ లోగోను తయారు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తుల మీద వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై క్లారిటీ ఇస్తూ%ఇస్టా వేదికగా ఒక పోస్ట్ వైరల్ అవుతుంది.

**కొణతం దిలీప్ రాసుకొచ్చింది ఇదే..**

"రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో నిన్న తెలంగాణ ప్రభుత్వం నామీద ఒక తప్పుడు కేసు పెట్టిన విషయం మీకు ఈపాటికే తెలిసి ఉంటుంది.ఆ కేసు పూర్వాపరాలు మీకు తెలిసి ఉండాలని ఈ నాలుగు మాటలు రాస్తున్నాను. గత కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంతకు ముందున్న కేసీఆర్ ప్రభుత్వం ఆనవాలు తుడిచేస్తామంటూ వివిధ సంస్థల పేర్లు మార్చే పనికిమాలిన పని ఒకటి పెట్టుకున్నది. దీన్లో భాగంగానే టీఎస్ఆర్టీసీ సంస్థ పేరును టీజీఎస్ ఆర్టీసీగా మార్చింది. రెండు రోజుల క్రితం రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక వాట్సాప్ గ్రూపులో ఆర్టీసీ కొత్త లోగో అంటూ ఒక ఇమేజ్ పంపారు. దాన్ని మే 22వ తారీకు నాడు అనేక మీడియా సంస్థలు ప్రచురించాయి. మీడియా గ్రూపుల్లో ఉన్న జర్నలిస్టు మిత్రుల నుండి కూడా ఈ విషయం రూఢి చేసుకున్నాను. ఆ లోగోలో ఇదివరకు పాత ఆర్టీసీ లోగోలో ఉన్న చార్మినార్, కాకతీయ తోరణం లేకపోవడం గురించి విమర్శిస్తూ నేను సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టాను.ఒకరోజు తరువాత ఆర్టీసీ ఉన్నతాధికారులు నన్ను సంప్రదించి తాము ఇంకా కొత్త లోగో ఖరారు చేయలేదు అని వివరణ ఇచ్చారు. అప్పుడు నేను నా సోషల్ మీడియా పోస్టులు తొలగించాను. కానీ నిన్న సాయంత్రానికి రేవంత్ సర్కార్ నా మీద, మిత్రుడు హరీష్ రెడ్డి మీద ఒక తప్పుడు కేసు పెట్టింది. మేమే ఆర్టీసీ నకిలీ లోగోను తయారుచేశాం అని మా మీద నిస్సిగ్గుగా ఒక అరోపణచేసి, వివిధ సెక్షన్ల మీద మా మీద కేసులు పెట్టింది. ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్టు అసలు ఈ లోగోను రిలీజ్ చేసింది వారే, ఇప్పుడు అది బ్యాక్ ఫైర్ అయ్యేసరికి మాలాంటి వాళ్ల మీద కేసులు పెడుతున్నారు. గమ్మత్తేమిటంటే మొన్న ఈ లోగోను అనేక మీడియా సంస్థలు ప్రచురిస్తే, వారెవరి మీదా కేసులు లేవు. ఇలా ప్రచురించిన మీడియా సంస్థల్లో ముందు వంసలో కాంగ్రెస్ అనుకూల మీడియా సంస్థలు ఎన్టీవీ, వీ6, బిగ్ టీవీ ఉన్నాయి. కానీ ఎన్టీవీ తమ సోషల్ మీడియాలో షేర్ చేసిన లోగోను నేను షేర్ చేస్తే నా మీద మాత్రం అక్రమ కేసులు పెట్టారు! తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సుమారు పదేళ్లు రాష్ట్ర డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా నిబద్ధతతో పనిచేశాను. ఫేక్ న్యూస్ వ్యాప్తిని నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను నెలకొల్పి వేలాది ఫేక్ న్యూస్‌కు అడ్డుకట్ట వేశాను. అలాంటి నా మీదనే ఇంత అన్యాయంగా, ఒక తప్పుడు కేసు పెట్టారంటే "ప్రజా పాలన" ముసుగులో గద్దెనెక్కిన ఈ కాంగ్రెస్ పాలన ఎట్లా సాగుతున్నదో మీ ఊహకే వదిలేస్తున్నా. ఇలాంటి కేసులు ఎన్నిపెట్టినా బెదిరేది లేదు. న్యాయస్థానాల మీద నాకు పూర్తి నమ్మకం ఉన్నది. దీనివెనుక ఉన్న అసలు దోషులెవరో వారి భరతం పట్టుడు ఖాయం. నిన్న, నేడు, రేపు తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసమే పనిచేస్తాను అని మరోసారి " అంటూ వివరణ ఇచ్చారు.

# నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



**విశ్వంభర, భద్రాచలం :** భద్రాచలంలో నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద స్థితితో మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొణిజర్ల మండలం సిద్ధిక్‌నగర్‌కు చెందిన పగిడిపల్లి కారుణ్య (17) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. గురువారం తెల్లవారుజామున 3:40 గంటలకు ఓ విద్యార్థిని బాత్‌రూం వెళ్లేందుకు బయటకు రాగా కారుణ్య కళాశాల ఆవరణలో రక్తపుగాయాలతో పడి ఉన్న విషయాన్ని గమనించి తోటి విద్యార్థినులతో కలిసి హాస్టల్ వార్డెన్‌కు తెలిపింది. వెంటనే 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 8.30 గంటలకు మృతి చెందినట్లు ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. ఆసుపత్రి వద్ద మృతురాలి కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఏఎస్పీ ఆసుపత్రి వద్దకు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా కారుణ్య కళాశాల భవనంపైకి వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు కావడంతో ఎందుకు వెళ్లి ఉంటుందోనని పోలీసులు ఆరా తీరుస్తున్నారు. పైఅంతస్తు నుంచి తానే దూకిందా? లేక ఎవరైనా తోసివేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. హాస్టల్‌లోకి ఆఘంతకుడు ప్రవేశించడం చూశామని కళాశాల విద్యార్థినులు తెలపడం గమనార్హం. కళాశాల యాజమాన్యం అసలు విషయాన్ని కప్పిపుచ్చుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని దళిత సంఘాలు పట్టుపడుతున్నాయి.

## ప్రియురాలు పిలిచిందని తెల్లవారుజామున

# ఇంటికి వెళ్లిన ప్రియుడు

- **సీసీ కెమెరా ద్వారా అలర్ట్ అయి పట్టుకున్న ప్రియురాలు తండ్రి**
- **అతన్ని చితకబాదుతుండగా గదిలోకి వెళ్లి దాక్కున్న ప్రియుడు**
- **డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రియుడు**

**విశ్వంభర, చార్మినార్ :** ప్రియురాలు పిలిచిందని తెల్లవారుజామున ఇంటికి వెళ్లిన ప్రియుడికి గట్టి షాక్ తగిలిన ఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ... పాతబస్తీ గౌస్ నగర్‌కు చెందిన అబ్దుల్ సోహైల్ (25) కు అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికతో సంవత్సరం క్రితం పరిచయమయ్యింది. ఈ నేపథ్యంలోనే వారి మధ్య ప్రేమ చిగురించి పెళ్లికి సిద్ధమయ్యారు. మూడు నెలల క్రితం ఆ ప్రేమ జంట ఇంటి నుంచి పరారయ్యింది. మైనర్ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండ్లగూడ పోలీసులు అబ్దుల్ సోహైల్ పై ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 45 రోజులు జైలు జీవితం గడిపిన అనంతరం సోహైల్ బెయిల్‌పై ఇటీవల ఇంటికి వచ్చాడు. సమాచారం అందుకున్న ప్రియురాలు మనకు కొడుకు పుట్టాడని ఇంకా వచ్చిచూడవా? అంటూ గత మూడు రోజులుగా సోహైల్‌కు ఫోన్‌లు చేయసాగింది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు మరోమారు సోహైల్ కు ఫోన్ చేయడంతో ప్రియురాలి ఇంటికి వెళ్లాడు. ఇంటి దగ్గరకి చేరుకున్నప్రియుడు మీనాన్న కు సంబంధించిన వాళ్లు ఇంటి బయట ఉన్నారని, సీసీ కెమెరాలు ఆన్‌లో ఉన్నాయా? అని ప్రియురాలికి ఫోన్ చేసి అడిగాడు. నేను సీసీ కెమెరాలు ఆఫ్ చేస్తానని చెప్పడంతో వెనుక మార్గం నుంచి ప్రియుడు ఇంట్లోకి ప్రవేశించాడు. సోహైల్ ఇంట్లోకి రాగానే సీసీ కెమెరా ద్వారా అలర్ట్ అయిన ఆమె తండ్రి అతన్ని పట్టుకున్నాడు. సోహైల్‌ను చితకబాదుతుండగా అతను తప్పించుకుని అదే ఇంట్లో ఓ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. వెంటనే సెల్ఫీ వీడియోలు తీసుకుని నన్ను చంపేస్తున్నారంటూ నేను గదిలోకి వెళ్లి దాక్కున్నానని, నన్ను రక్షించండి అంటూ డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్న అనంతరం వారి సమక్షంలో ఆ గది నుంచి బయటికి వచ్చాడు. దీంతో పోలీసులు సోహైల్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించిన ఆడియోలు, సెల్ఫీ వీడియోలు వైరల్‌గా మారాయి. ఆమె తండ్రి ఓ బీఆర్ఎస్ నాయకుడని మా పై కావలసుకుని కుట్రతో కేసులు పెడుతున్నాడని, సోహైల్ సోదరి ఆరోపించింది.



## ఎంపీ పదవికి రాజీనామా చేసే

# ప్రసక్తే లేదు

**తేల్చి చెప్పిన స్వాతి మాలీవాల్**

**విశ్వంభర, ఢిల్లీ :** ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ తన పదవికి రాజీనామా చేసేది లేదని స్పష్టం చేశారు. పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా అభ్యర్థిస్తే ఖచ్చితంగా పదవి నుంచి వైదొలిగెదాన్నన్నారు. అలా కాకుండా దాడి చేయడంతో... ఇప్పుడు పదవికి రాజీనామా చేసేదే లేదని తేల్చి చెప్పారు. "ఆప్ ను స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం ఎంతో శ్రమించాను. 2006లో వీరితో కలిసి పని చేసేందుకు వీలుగా నా ఉద్యోగాన్ని వదులుకున్నాను. అప్పుడు మా సంస్థలో ముగ్గురే ఉండేవారు. వారిలో నేను ఒకరిని. ఎవరికైనా నా రాజ్యసభ సీటు కాలవాలంటే నన్ను అడగాలి. పార్టీ కోసం జీవితాన్నే ఇచ్చాను. ఎంపీ సీటు చాలా చిన్న విషయం. నేను ఆప్ లో చేరినప్పటి నుంచి ఎటువంటి పదవీ కోరలేదు. కానీ, వారు నాతో ఇలా ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్టిపరిస్థితుల్లో రాజీనామా చేయను " అని మాలీవాల్ పేర్కొన్నారు.

## తెలంగాణ పాలీసెట్

# కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** 2024-25 విద్యాసంవత్సరానికిగానూ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలయ్యింది. ఈ మేరకు జూన్ 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం.. జూన్ 22వ తేదీ నుంచి తొలి విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం, జూన్ 30వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా రెండో విడత కౌన్సెలింగ్‌ను జూలై 7వ తేదీన ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జూలై 9న వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుందనీ.. 13నుంచి సీట్ల కేటాయింపు ఉండనునట్లు తెలిపారు. జూలై 21వ తేదీ నుంచి ఇంటర్నల్ స్లైడింగ్‌కు అవకాశం కల్పించారు. అలాగే జూలై 24వ తేదీ లోపు అన్ని సీట్లను భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. మరోవైపు జూలై 23న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు.




## మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై కేసు

**విశ్వంభర, చేవెళ్ల :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై చేవెళ్లలో కేసు నమోదైంది. తన భూమిని కబ్జా చేశారంటూ ఓ వ్యక్తి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనపై మారణాయుధాలతో బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జీవన్ రెడ్డితో పాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. ఎర్లపల్లిలో 20 ఎకరాల 20 గుంటల భూమిని 2022లో దామోదర్ రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. సర్వే నెంబర్ 32, 35, 36, 38 లో ఫంక్షన్ హాల్ నిర్మించుకున్నాడు. అయితే, దామోదర్ రెడ్డి భూమికి పక్కనే జీవన్ రెడ్డి భూమి ఉంది. 2023 లో ఫంక్షన్ హాల్‌ను కూల్చేసి దామోదర్ రెడ్డి భూమిని జీవన్ రెడ్డి కబ్జా చేసినట్లు సమాచారం. అయితే, కబ్జా చేసిన భూమికి రక్షణగా పంజాబీ గ్యాంగ్‌ను జీవన్ రెడ్డి కాపలా పెట్టాడు. తన ఫంక్షన్ హాల్ కూల్చేయడంతో నిలదీసేందుకు వెళ్లిన దామోదర్ రెడ్డిపై దాడికి దిగారు పంజాబీ గ్యాంగ్.. మారణాయుధాలు చూపించి దామోదర్ రెడ్డిని.. జీవన్‌రెడ్డి అనుచరులు బయభ్రాంతులకు గురిచేశారని బాధిడుతు తెలిపాడు. దీంతో జీవన్ రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై చేవెళ్ల పోలీసులు ఆరు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.



నల్లగొండ పట్టణంలో ప్రముఖ రేపో్కొ హెూమ్ లోన్స్ పైనాన్స్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆ సంస్థ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సెల్వ కుమారస్వామి
**– విశ్వంభర, నల్గొండ**

# మద్యపానం అభివృద్ధిలో చిల్లికుండ



మద్యపానం అనేది దేశ వ్యాప్తంగా అభివృద్ధిలో చిల్లికుండగా మారుతున్నది. చిల్లికుండలో నీరు కొద్దికొద్దిగా కారిపోయి చివరకు ఏమీ మిగలకుండా ఖాళీ అవుతున్నది. అలా ప్రజల బతుకులు మద్యపానంతో ఖాళీ అవుతున్నది. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఆవలివైపు ఉన్న దూల్‌పేటలో సారా కాసి కాసి, తాగి తాగి చాలామంది చనిపోయారు. భర్తలు చనిపోయిన మహిళలకు పేపర్లతో విస్తర్లు తయారు చేసే స్కీము పెడితే అది మార్కెట్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంవల్ల మూలన పడింది. మహారాష్ట్రలో, తెలంగాణాలో మద్యపానం వల్ల అర్ధంతరంగా భర్తలు చనిపోవడం వల్ల లక్షలాది మహిళలు వితంతువులుగా మారారు. ఇద్దరు ఉన్నప్పుడే చాలని సంపాదన ఒంటరి మహిళ పిల్లలను ఎలా పెంచి పోషిస్తుంది? అమెరికాతో సహా అనేక దేశాలు ఒంటరి మహిళలు ఆసరా పథకాలు ప్రవేశపెట్టాయి.


– బి.ఎస్. రాములు
సామాజిక తత్వవేత్త, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్
ఫోన్ : 8331966987

### నియంత్రణ లేని మద్యపానం

మద్యపానం వల్ల నేరాలు పెరుగుతున్నాయి. ఆరోగ్యాలు చెడిపోతున్నాయి. రోగాల బారినపడి ఉన్నదంతా వైద్యానికే ఖర్చు చేస్తున్నారు. జీవితాలు ముగిస్తున్నారు. తాగి తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వేశ్యా వృత్తి పెరుగుతున్నది. అప్పులు పెరుగుతున్నాయి. తెలంగాణాలోని కోటి కుటుంబాల్లో 40 లక్షల కుటుంబాలు మద్యపానం వల్ల కునారిల్లిపోతున్నాయి. ఎన్ని పథకాలు పెట్టినా వారి జీవన ప్రమాణాలు పెరగకపోవడానికి ప్రధాన కారణం మద్యపానమే. కేరళలో పెద్ద పెద్ద స్టార్ హోటల్లో తప్ప మద్యం సాధా రణ ప్రజలకు అందకుండా పాక్షిక మద్యపాన నిషేధం విధించడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు దేశంలో అత్యున్నతంగా పెరిగాయి. తెలంగాణాలోనూ, దేశవ్యాప్తంగానూ ఈ పాక్షిక నిషేధం విధిస్తే దొంగ సారా, కల్తీ మద్యం వంటివి కూడా చాలామేరకు తగ్గిపోతాయి.

### ఏడాదికి రూ.90 వేల కోట్ల సంపద వృథా

దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకులు, సామాజిక శాస్త్రవేత్తలు, మేధావులు, జర్నలిస్టులు ఈ విషయం చాలా ప్రధానమైనదిగా గుర్తించడం అవసరం. భారత రాజ్యాంగంలో బాల కార్మిక వ్యవస్థ, అంటరానితనం, మద్యపాన నిషేధం, గోవధ నిషేధం, ఎస్సీ, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాల విద్య, ఉద్యోగాలు, ఉపాధి కల్పన ప్రముఖంగా చేర్చబడ్డాయి. మద్యపానం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి యేటా 20 వేల కోట్ల నుండి 30 వేల కోట్లు ఆదాయం వస్తున్నది. గత పదేళ్ళలో ప్రభుత్వం మద్యం విక్రయం ద్వారా 3 లక్షల కోట్ల ఆదాయం పొందింది. మద్యం వ్యాపారులు, బారులు, హోటల్, తినుబండారాళ్ళ ఖర్చు మొదల్కైనవి కలిపి మరో 60 వేల కోట్లు యేటా మద్యం సందర్భంగా ప్రజలు ఖర్చు చేశారు. ఇలా యేటా 90 వేల కోట్ల రూపాయల సంపద డ్రైనేజీలో పోసినట్టయింది. ఇలా గత పదేళ్ళలో 9 లక్షల కోట్ల రూపాయల సంపద ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధికి కాకుండా వృథా అయిపోయింది. మద్యపానం నిషేదిస్తే ఈ 9 లక్షల కోట్లు ద్వారా ప్రజల కొనుగోలు శక్తి కూరగాయలకు, బట్టలకు, బడి చదువులకు, తిండికి, గృహ నిర్మాణానికి, పౌష్టిక ఆహారానికి ఖర్చు చేసి ఉండేవారు. అందులో నాలుగో వంతు పొదుపు చేసినా 2 లక్షల కోట్లు బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతాల్లో అదనంగా జమ అయి ఉండేవి. ఇలా రాష్ట్రంలో మ ద్య పానం నిషేదం ద్వారా వ్యాపారం, పరిశ్రమలు అనేక ఉత్పత్తులు మార్కెటింగ్ తొమ్మిది లక్షల మేరకు అదనంగా పెరిగి ఉండేవి. తద్వారా నాలుగు లక్షల కోట్లు జిఎస్టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం అంది ఉండేది. అనగా మద్యపానం ద్వారా వచ్చే ఆదాయం కన్నా లక్ష కోట్ల ఆదాయం ప్రభుత్వానికి ఎక్కువ సమకూరు తుంది. ఈ విషయాన్ని కేరళ, బిహార్‌లో నితీశ్‌కుమార్ లెక్కలతో సహా నిరూపించారు. అందు వల్ల మద్య పాన నిషేదం వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గుతుందనడం మూరత్వం తప్ప మరొకటి లేదు. ప్రజలు ఖర్చు చేసే ప్రతి వంద రూపాయల్లో 50 రూపాయలు ఏదో రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. ఈ విష యాన్ని మరోసారి వివరిస్తాను. మద్యపానం నిషేదిస్తే పెరిగిన పొదుపు వల్ల 2 లక్షల కోట్లు పెట్టుబడిగా ప్రభుత్వానికి డిపాజిట్ల రూపంలో, ఇన్సూరెన్స్‌ల రూపంలో పారిశ్రామిక అభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగపడేది. 6 లక్షల కోట్లు అప్పులు చేయాల్సిన దుస్థితి, దానికి 9 శాతం వడ్డీ కట్టాల్సిన దుస్థితి ఉండేది కాదు. ఈ 9 శాతం వడ్డీ ప్రజలకే అందితే ప్రజ లు ముఖ్యంగా మహిళలు, ఉద్యోగులు, కార్మికులు మరింత పొదుపు చేసి ఉండేవారు. అలా పొదుపు ద్వారా రాష్ట్రానికి 3 లక్షల కోట్లు పెట్టుబడిగా



వివిధ రంగాలలో ఉపయోగించుకోవడానికి అందుబాటులోకి వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో సీరియ స్‌గా ఆలోచిస్తే ప్రభుత్వం పెట్టాల్సిన ఖర్చేమి లేకుండా అదనంగా యేటా 30 వేల కోట్లు పెట్టుబడులకు ప్రజల నుండి లభిస్తాయి. అలా వాటి ద్వారా కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డు, మార్క్‌ఫెడ్, టిసిఎంఎస్, సరుకుల ప్రజా పంపిణీ వ్యవస్థ, నీటి ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధి ద్వారా సంపద మరింత పెరుగుతుంది. తక్కువ పెట్టుబడితో ప్రజలకు మద్య తరగతికి చక్కని గృహ వసతి, ఉన్నత విద్య, ఉపాధి కల్పన పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభు త్వం వీటిని అమలు జరిపినవే అని మరిచిపోరాదు. వాటిని మరింత ఆధునిక పద్ధతిలో అమలు జరపడం అవసరం. ఈ పని టిఆర్ఎస్ ప్రభుత్వం చేయక రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల పాలు చేసింది. అన్నింటిని కుదువబెట్టింది.

### అప్పటి వరకు ఏ సంక్షేమ పథకం పెట్టినా వృథానే..

ఆసరా పథకం ద్వారా పంపిణీ చేసే సంక్షేమ పథకాల ద్వారా కూడా 40 శాతం తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేరుతున్నది. ఈ విషయం కేసీఆర్‌కు తెలుసు. ఈ రహస్యం తెలియక ఉచిత పథకాలు, సబ్సిడీలు ఒద్దని మాట్లాడ్డం అర్థ శాస్త్రంలో ఏబీసీడీలు తెలియని 'మహా మేధావులు' విమర్శిస్తుంటారు. కరోనా కాలంలో బుద్ధి లేక అమెరికా, యూరపు, దేశాలు, ఆస్ట్రేలియా కొన్ని నెలల పాటు ఉచితంగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. తద్వారా మొత్తం మార్కెట్ వ్యవస్థను ప్రజల జీవితాలను రెగ్యులరైజ్ చేసింది. దీని వెనుకగల అర్థ శాస్త్రం అర్థం చేసుకుంటే ఉచిత పథకాలు, సబ్సిడీలు అంటూ ఎవరూ వ్యతిరేకించరు. అలాంటి విశ్లేషణలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకురావడం అవసరం. భారత రాజ్యాంగంలోని మద్యపాన నిషేదాన్ని అమలు జరపడం ద్వారా ఇలా ప్రభుత్వాలకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. నేరాలు తగ్గుతాయి. వితంతువుల సంఖ్య తగ్గుతుంది. జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. మద్యపానం నిషేధించేదాక ప్రజల కోసం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా అవి అంతిమంగా చిల్లికుండ వలె నీరు కారిపోతూనే ఉంటాయి అని మరిచి పోకూడదు.



# భూమి పుత్రుడు రైతు

రైతే దేశానికి వెన్నెముక, భారతదేశ పూర్వం నుండి వ్యవసాయ ప్రధాన దేశం. పూర్వం గ్రామాల కన్నా నేడు ఎంతో కొంత ఆధునికమైనవి. అయినా గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కొనసాగుతున్నది. భారతదేశం పూర్వం నుండి వ్యవసాయ ప్రధాన దేశం భారతదేశ వ్యవసాయక దేశం ఇప్పటికీ 70% మీద ప్రత్యక్షంగా పరోక్షంగా వ్యవసాయం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే రైతులు దేశానికి వెన్నెముక అన్నారు. ఏ ప్రాణికైనా బతకడానికి ఆహారం అవసరం ఆ అవసరాన్ని తీర్చేది వ్యవసాయం. వ్యవసాయం చేసేవారు రైతులు, వ్యవసాయంపై ఆధారపడ్డ దేశాలకు పల్లెలే పట్టుకొమ్మలు. చక్కటి పాడిపంటలతో అలారారే పల్లెలు ప్రకృతికి ప్రతిరూపాలు. రైతు విద్యావంతుడు కానప్పటికీ సంస్కారవంతుడు, తాను తనతో పాటు అందరూ అనే భావంతో జీవిస్తాడు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న తోటి వారి కష్టాల్లో పాలుపంచుకోవడానికి ముందుంటాడు. తినడానికి తిండి కట్టడానికి బట్ట ఉండడానికి వీలు లేకపోయినా ముఖంలో దిగులు కనబడనీయడు. "హలం అంటే నాగలి " నాగలితో భూమిని సాగు చేసి, జీవనం సాగించే రైతే హాలికుడు. సాత్విక భావాలతో "బ్రతుకు బ్రతికించు" అన్న సిద్ధాంతానికి కట్టుబడి ఉంటాడు రైతు. పాడి పంటలతో నేల తల్లికి పశువులకు ప్రకృతికి సేవలు చేస్తూ ఆశావాద దృక్పథంతో జీవిస్తాడు.

రైతులు మనకు అన్నదాతలు ఎండకు ఎండి వానకు తడిసి చలికి వనికిన ధైర్యంతో కష్టపడి రైతు పంటలు పండిస్తాడు. రాత్రింబ వళ్ళు రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించే రైతు కష్టాన్ని చూసే " జై జవాన్ జై కిసాన్ " అన్నాడు లాల్ బహదూర్ శాస్త్రి ఇటువంటి రైతే లేకపోతే మన జీవితాలే ఊహించలేం. అందుకే రైతే దేశానికి వెన్నెముక అన్న సత్యాన్ని మరవకూడదు. జాతీయ రైతు దినోత్సవం చౌదరి చరణ్ సింగ్. భారతదేశ ఐదవ ప్రధానమంత్రి పుట్టినరోజు సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం జరుపుకుంటాం. రైతు కష్టమే ఫలితమే దేశ సౌభాగ్యం, రైతులకు అండగా నిలుద్దాం రైతన్నలను గౌరవిద్దాం రైతులకు విలువనిద్దాం.



– దేవులపల్లి రమేశ్,
సిద్దిపేట జిల్లా, నంగునూర్,
9963701294

# అలంకార ప్రాయంగా కామన్వెల్త్



కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లూ లేకుండా స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసి ఉండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు.

### కామన్వెల్త్ రూపకల్పన

కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటీ అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాధనను 1898లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైంది. 1884 లో లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటీష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటీష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్"గా అభివర్ణించాడు.
20వ శతాబ్దం ఆరంభంలో బ్రిటీష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది.

### ఎంపైర్ డేగా క్వీన్ విక్టోరియా జయంతి..

1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డంలో





తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా నిర్వహించారు. 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. 1921 జనవరి లో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంఛనంగా ఆహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందం కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుంచి 1929 వరకు ఉద్యమ తొలి అధ్యక్షుడిగా మీథ్ కొనసాగాడు. 1901లో మరణించిన క్వీన్ విక్టోరియా జయంతిని మే 24వ తేదీన ఏటా 'ఎంపైర్ డే'గా నిర్వహించాలని నిర్ణయించారు.

### కామన్వెల్త్ నేషన్స్‌గా రూపాంతరం

1931లో బ్రిటీష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్ ఏర్పడింది. 1931 లో యునైటెడ్ కింగ్డం, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటీష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది. 1949లో ఆ పేరు నుంచి 'బ్రిటీష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటీష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటీష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది.
ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర్య దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటీష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటీష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి.

విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి.

దాదాపు 790 కోట్ల ప్రపంచ జానాభాలో 260 కోట్ల మంది.. అంటే మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువ మంది 30 ఏండ్లలోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే.
2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించు కున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు.

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

– రామకిష్టయ్య సంగన భట్ల,
9440595494



# ఆమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**కలెక్టర్ రాహుల్ రాజ్**

**విశ్వంభరా, నారాయణఖేడ్ మే 24:** జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో చేగుంట పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువు లోగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గుర్తించబడిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఎంపికైన 562 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటి వరకు అభివృద్ధి పనులు 60% పూర్తయ్యాయన్నారు. ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పనుల పురోగతిపై సమీక్షించి త్వరితంగా పూర్తయ్యేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# స్కూల్ యూనిఫామ్స్ సంవత్సరం ధరించేలా కుట్టండి

- మీ పిల్లల బట్టలే కుడుతున్నామనుకోండి..
- దారం, రవాణా ఖర్చులనే నేనే భరిస్తాను
- స్కూళ్లు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు అందించాలి
- స్వశక్తి మహిళలతో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

**విశ్వంభర, కరీంనగర్, మే 24 :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సంవత్సరం పాటు ధరించేలా మన్నికగా యూనిఫామ్స్ కుట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నిర్వాహకులకు సూచించారు. స్కూల్లు ప్రారంభమయ్యే లోపు యూనిఫామ్స్ రెడీ చేయాలని పేర్కొన్నారు. శుక్రవారం గంగాధర మండలం రంగారావుపల్లిలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూనిఫామ్స్ కుడుతున్న స్వశక్తి మహిళలతో మాట్లాడారు. రోజుకు ఎన్ని యూనిఫామ్స్ కుడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. దుస్తులు సంవత్సరం కాలం పాటు మన్నికగా ఉండేలా డబుల్ స్టిచ్చింగ్ చేయాలని సూచించారు. లేకపోతే తొందరగా కుట్లు పోతాయని వివరించారు. యూనిఫామ్స్ మీ పిల్లలవే కుడుతున్నామనుకొని భావించి మంచిగా కుట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫామ్స్ కి వాడే దారం ఖర్చులు తాను చెల్లిస్తానని చెప్పారు. అదేవిధంగా దుస్తులు తీసుకురావడానికి అయ్యే రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తామని చెప్పారు. స్కూల్స్ ప్రారంభమయ్యే లోపు యూనిఫామ్స్ రెడీ కావాలని పేర్కొన్నారు. ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కస్తూర్బా, మోడల్ స్కూల్లు, అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 30,810 మందికి యూనిఫామ్స్ అందించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఏ సునీత, డీఎల్పీఓ రాంబాబు, తహసీల్దార్ వినయ్ కుమార్, డీపీఎం ప్రవీణ్, ఎంపీఓ జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

**ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన**

**విశ్వంభర, నలగొండ మే 24:** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా వరంగల్-ఖమ్మం -నల్గొండ శాసనమండలి పట్టబద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ను నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. శుక్రవారం నల్గొండ కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణకు ఆమె హాజరై పలు సూచనలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను ఆశమాషిగా తీసుకోవద్దని, అన్ని విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకోవాలని శిక్షణలోనే మాదిరి పోలింగ్‌ను నిర్వహించాలని చెప్పారు. 800 పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 2 బ్యాలెట్ బాక్సులు ఇవ్వడం జరుగుతుందని, ఇటీవలే పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించినందున ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్క్ చేయాలని అన్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం ద్వారా సరఫరా చేసిన వాయిలెట్ స్కెచ్ పెన్ ద్వారా మాత్రమే ఓటు వేయాలని, ఓటును ప్రాధాన్యత క్రమంలో వేయాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇంకు బాటిల్, ఇంకు పెన్నుల లాంటివి అనుమతించవద్దని చెప్పారు. ఎవరైనా ఓటు వేసిన తర్వాత సెల్ఫోన్తో ఫోటో తీసినట్లైతే



క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వెబ్ కాస్టింగ్ నియంత్రణలో ఉంటుందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం బయట ఓటు ఎలా వేయాలో తెలియజేసే పోస్టర్, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఓటర్లకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై తెలియజేశారు. మొదటి ప్రెసైడింగ్ అధికారి, రెండవ ప్రెసైడింగ్ అధికారి చేయాల్సిన విధులను తెలియజేశారు. కార్యక్రమానికి స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీఓలు, మాస్టర్ ట్రైనర్ బాలు హాజరయ్యారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంపై సమీక్ష

- వేడుకలకు పరేడ్ గ్రౌండ్ వేధిక
- ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**విశ్వంభర, హైదరాబాద్ మే 24 :** జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, ముఖ్య కార్యదర్శులు బి వెంకటేశం, జితేందర్, కార్యదర్శులు క్రిస్టినా జోంగ్తు, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, సీడీఎంఏ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.




# బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- పదేండ్ల పాలనలో ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టింది బీఆర్ఎస్
- తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియమ్మ
- దొరల అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారంలో మంత్రి సీతక్క

**విశ్వంభర, ములుగు మే 24:** కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి పట్టుమని ఆరునెలలు కాకుండానే కావాలని నేడు కాంగ్రెస్ మీద బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తుందని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వరంగల్ - ఖమ్మం - నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ములుగు మండలం, ఇంచర్లలో జరిగిన సభలో మంత్రి ప్రశంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.500 బోనస్ పథకాలు ప్రవేశ పెట్టిందని, అలాగే పార్లమెంట్ ఎన్నికల తరువాత ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, ఆగస్టు 15 వరకు 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తుందని అన్నారు. ఇప్పటికే ఎన్నో మెగా డీఎస్సీ లాంటి ప్రకటనలు ఇచ్చారని, అలాగే శాశ్వత పద్ధతిన ఉద్యోగ భర్తీ చేపట్టి, గత పదేండ్ల దుర్మార్గుల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అలాంటి పార్టీపై కావాలని కొందరు అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గం అని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ - ఖమ్మం - నల్గొండ జిల్లాల అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని, మల్లన్న కూడా పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని, దొరల అహంకార పూరిత ధోరణి పై తిరుగుబాటు జెండా ఎగరేసిన వ్యక్తి అన్నారు. బీఆర్ఎస్ అన్యాయాలను, అక్రమాలను బయటికి తీసిన ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు అందరూ మే 27 న రెండవ నెంబర్ హస్తం గుర్తుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# ప్రశ్నించే వ్యక్తినే చట్ట సభలకు పంపాలి

- చట్టాలపై అవగాహనతోనే ప్రశ్నించే సామర్థ్యం
- రాజకీయ అంశాలపై పరిజ్ఞానం ఉండాలి
- సీరియల్ నెం.12పై మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి
- ఎమ్మెల్సీ అభ్యర్థి డా.ఈడా శేషగిరిరావు గౌడ్




**విశ్వంభర, నల్గొండ మే 24 :** ప్రశ్నించే విద్యావంతులను చట్ట సభలకు పంపాలని వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి, ఆధార్ పార్టీ (చపాతీ రోలర్ గుర్తు )జాతీయ అధ్యక్షులు డా. ఈడా శేషగిరిరావు గౌడ్ అన్నారు. తాను నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యల సాధనకు కట్టుబడి ఉన్నానని, చట్ట సభల్లో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేయడంతో పాటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆధార్ పార్టీ నల్గొండ లోక్ సభ ఇంచార్జి సకినాల హరినాథ్ అధ్యక్షతన జరిగిన ఆధార్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఈడా శేషగిరిరావు గౌడ్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ.. ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈడా శేషగిరి గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరుద్యోగులను సమీకరించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని, ఉద్యోగులకు బాసటగా నిలుస్తామని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో రాజకీయ పరిజ్ఞానం కలిగి, ప్రభుత్వాన్ని ప్రశ్నించె సత్తా ఉన్న, నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలపై పోరాడే అభ్యర్థులనే గెలిపించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్యం పార్టీ పూలే అంబేడ్కర్ జాతీయ అధ్యక్షుడు లాలు నాయక్ రమావత్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా సౌమ్యుడుగా, నీతి నిజాయితీపరునిగా మంచి పేరు గల వ్యక్తి ఈడా శేషగిరిరావు గౌడ్ అన్నారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఆధార్ పార్టీ అభ్యర్థి శేషగిరి గౌడ్ గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, మేధావులు పాల్గొన్నారు.

# డ్రయినేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**విశ్వంభర, నాచారం మే 24:** నాచారం డివిజన్లోని రాఘవేంద్ర నగర్లో చేపడుతున్న డ్రయినేజీ పనులను శుక్రవారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.10 లక్షల వ్యయంతో ఓపెన్ డ్రయినేజీ పనులకు టెండర్ ఆహ్వానించగా కాంట్రాక్టర్లు సకాలంలో రాకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు. బుధవారం ట్రాక్టర్లు రావడంతో పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, ముత్యం రెడ్డి, మారయ్య, ప్రీతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

- పోలింగ్ ముందు 48 గంటలు సైలెంట్ పిరియడ్ : ఎస్పీ చందనా దీప్తి

**విశ్వంభర, నల్లగొండ మే 24:** వరంగల్ -ఖమ్మం -నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, 25-05-2024 సాయంత్రం 4 గంటల నుంచి తేది 27-05-2024 పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందని ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో ఎన్నికలకు సంబందించిన సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవ్వరూ.. 5 గురి కంటే ఎక్కువ గుంపులుగా ఉండ కూడదన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎవరైన ఓటర్లను ఆకర్షించేందుకు ఉచిత పంపిణీలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు సి.విజిల్ ఆప్ ద్వారా పిర్యాదు చేయగలరని అన్నారు. వేరే నియోజకవర్గం నుంచి ప్రచారానికి వచ్చిన వాళ్లు స్థానికంగా ఏవ్వరూ ఉండకూడదని, లాడ్జ్ లు, గెస్ట్ హౌస్ లు, హెూటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు మరియు రాజకీయ పార్టీల వారు 25-05-2024 సాయం త్రం 4 గంటలలోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని పేర్కొ న్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.



# రైతులను మోసగిస్తే.. కఠిన చర్యలు : ఏఓ

**విశ్వంభర, షాద్ నగర్ మే 24 :** గడువు తీరినవి, నకిలీ విత్తనాలు, ఫెర్టిలైజర్స్ రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారి నిశాంత్ కుమార్ హెచ్చరించారు. వానాకాలం సీజన్ లో భాగంగా ఫరూక్ నగర్ మండలంలోని విత్తన కంపెనీలు మరియు విత్తన డీలర్ షాప్ లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా షాప్ లోని వివిధ రకాల విత్తనాలను పరిశీలించి డీలర్లకు సూచనలు, సలహాలు పాటించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సీడ్స్, పెస్టిసైడ్, ఫెర్టిలైజర్ లైసెన్సుల కాలపరి మితిని చెక్ చేసుకోవలెనన్నారు. అన్ని రకాల స్టాక్ రిజిస్టర్ లు మరియు బిల్‌బుక్‌లు మండల వ్యవసాయ అధికారిచే సర్టిఫై చేపించుకోవాలన్నారు. గడువు ముగిసిన సీడ్స్, పెస్టిసైడ్, ఫెర్టిలైజర్ ఉండకూడదని హెచ్చరించారు. రోజు వారీ ధరల వివరాలను, స్టాక్ వివరాలను తప్పనిసరిగా స్టాక్ బోర్డ్ లో పొందుపరుచాలన్నారు. కంపెనీల నుండి స్టాక్ తీసుకునే ముందు తప్పనిసరిగా ఇన్వాయిస్ తీసుకొని స్టాక్ తెచ్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను అమ్మిన, నిల్వ ఉంచిన, కొన్న చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.



## తీన్మార్ మల్లన్న గెలుపులో
# కీలక పాత్ర పోషించాలి

**యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి**

**విశ్వంభర, నల్లగొండ మే 24 :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శుక్రవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్ అధ్యక్షతన యువజన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శివసేనారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రతీ యూత్ కాంగ్రెస్ కార్యకర్త మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలన్నారు. యువజన కాంగ్రెస్ లో కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నల్గొండ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలిస్తే ఆ క్రెడిట్ యువజన కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ సింగ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా రాకేష్, ఎండీ గౌస్, జిల్లా ఉపాధ్యక్షుడు జయంత్ రెడ్డి, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు జహంగీర్ బాబా, సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షుడు హరికృష్ణ, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, నల్గొండ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, మండలాధ్యక్షుడు కోప్పు నవీన్ గౌడ్, కనగల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కుసుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ, అమిత్ షాకు కోర్టులంటే
# గౌరవం లేదు : షబ్బీర్ అలీ




**విశ్వంభర, హైదరాబాద్ :** మోడీ, అమిత్ షాకు కోర్టులంటే లెక్కలేదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. అందుకే కోర్టు పరిధిలో ఉన్న అంశాలను ఎన్నికల్లో ప్రచారంలో వాడకుంటున్నారని మండిపడ్డారు. ముస్లిం రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టులో ఉందని గుర్తు చేశారు. న్యాయస్థానంలో విచారణలో అంశంపై మోడీ, అమిత్ షా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసలు ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ నేతలు ఎలా చెబుతారని ఫైర్ అయ్యారు. ముస్లింలలో రిజర్వేషన్లు అందరికీ లేవని.. కేవలం వెనబడిన వారికి మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ముస్లిం రిజర్వేషన్లుపై మాట్లాడి.. మత చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని షబ్బీర్ అలీ.. బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో శుక్రవారం బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు గజరాజ్ కాశినాధ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోసం ఇంటిం టి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జ్ బొట్టు కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బలా ఇంద్రారెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి బండారి సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి తవిటి రాంరెడ్డి, మండల కార్యదర్శులు బబ్బురి శివ లింగం గౌడ్, బూడిద నర్సింహ, బీజేవైఎం మండలాధ్యక్షుడు పైళ్ల ప్రశాంత్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు ఆకుల రవీందర్, ప్రధాన కార్యదర్శి లోడి మహేష్, మధు, సూర్య, సాయి, మహేష్, హరికృష్ణ, ఓనం మధు తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూరులో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)మే 24 :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేం ద్రంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ఆదేశాలా మేరకు కాంగ్రెస్ పార్టీ బలపరి చిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూమండ్ల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి వంగాల మల్లేశ్, ఆలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుగ్గ మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుగ్గ సిద్ధులు, బాల్ద శ్రీశైలం, పంతంగి ఉదయ్ కిరణ్, జూకంటి మధు, జంగావెల్లి రాజశేఖర్, వంగాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న డీసీఎం.. డ్రైవర్ దుర్మరణం

**విశ్వంభర, రాజేంద్రనగర్ :** ముందు వెళ్తున్న లారీని డీసీఎం ఢీ కొనడంతో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బి.యన్.రెడ్డి ప్రాంతానికి చెందిన శిశుపాల్ రెడ్డి (49) శంషాబాద్ వైపు నుంచి గచ్చిబౌలి వైపు డీసీఎం లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ఎగ్జిట్ నెంబర్ 18 వద్ద ముందు వెళు తున్న లారీని డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో డీసీఎం నడుపుతున్న శిశుపాల్ రెడ్డి కడుపులో స్టీరింగ్ బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో డీసీఎంతో పాటు లారీ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వాహనాలను అక్కడి నుంచి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో కుమ్ములాట..

- మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రారంభంతో తారస్థాయికి వర్గ పోరు
- కారేపల్లిలో మినిస్టర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభించనున్న పొంగులేటి అనుచరగణం



**విశ్వంభర, కారేపల్లి :** కాంగ్రెస్‌లో వర్గ పోరు తీవ్రమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి గురువారం తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కారేపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మంత్రి పొంగులేటి వర్గాలకు మధ్య ఎమ్మెల్యే సమక్షంలోనే వాదోపవాదాలు జరిగినాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే కూడా ఏకపక్షంగా తన వర్గానికి మద్దతు పలికి పొంగులేటి మనుషులను వేదిక దిగండి అంటూ హుకుం జారీ చేయడంపై ఖంగు తిన్న పొంగులేటి వర్గీయులు సభావేదిక పై నుండి వెళ్ళిపోయారు. దీనిని మంత్రి పొంగులేటి వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏక పక్షంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తీరుతో ప్రజలకు, ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు సక్రమంగా చేరడానికి కార్యకర్తలను సన్నద్ధం చేయడం కొరకు మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో ఈనెల 28వ తేదిన ప్రారంభించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు గ్రూపులకు సమన్వయం లేక నివురుగప్పిన నిప్పులాగా ఉన్న వర్గ పోరు మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభంతో తారాస్థాయికి చేరే అవకాశం ఉందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి మద్దతుగా
# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్ రెడ్డి**




**విశ్వంభర, నకిరేకల్ మే 24 :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మద్దతుగా నకిరేకల్ లో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోసపోతే గోస పడుతాం అని చెప్పినం.. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో విచక్షణతో ఓటయ్యాలన్నారు. రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేసిందు రేవంత్ రెడ్డి.. ధాన్యం బోనస్ విషయంలో కూడా మాట తప్పిండు, సన్న వొడ్లకు మాత్రమే బోనస్ అంటూ అన్ని బోగస్ మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం ఓట్లప్పుడు మాత్రమే రైతు బంధు ఇస్తుందని, మహిళలకు 2,500 ఇస్తామని మోసం చేసిందన్నారు. దేవుళ్ళ మీద ఓట్లు వేస్తూ రేవంత్‌రెడ్డి పూటకో అబద్ధం అడుతున్నాడని, నోటిఫికేషన్లు ఇవ్వకుండా, జాబ్‌లు ఇచ్చినం అని అబద్ధాలు అడుతున్నారని పేర్కొన్నారు. 30 వేల ఉద్యోగాలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రిక్రూట్మెంట్ చేస్తే కాంగ్రెస్ వాటికి కాగితాలు పంచిందన్నారు. గొప్ప విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి ఓటేస్తే ప్రభుత్వంపై కొట్లాడి నిరుద్యోగులకు, ఉద్యోగులకు న్యాయం చేస్తాడన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పచ్చి బ్లాక్ మైలర్ అని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్లు బండా నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామా మల్లేష్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో నిరుద్యోగులను మోసం చేసిన ఘనత
# కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది

**బీజేపీ నేత ఈటెల రాజేందర్**



**విశ్వంభర, తొర్రూరు :** తెలంగాణలో నిరుద్యోగులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ మంత్రి బీజేపీ నేత ఈటెల రాజేందర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో, పాలకుర్తి నియోజకవర్గం స్థాయి, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎన్నికల సందర్భంగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఈటల మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు 4000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేశాయన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోవాలని నిరుపేదలు ఆస్తుల అమ్మి వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. నిరుపేదలకు వైద్యం ఖర్చులు పెట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలు ఇస్తున్నారని అన్నారు. ఆగస్టు 15 లోపల రుణమాఫీ చేయడం అసాధ్యమని అన్నారు. ఇంత తక్కువ కాలంలో ప్రజల చేత చీత్కరింపబడిన ప్రభుత్వం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. ఆర్ఆర్ టాక్స్ పేరుతో తెలంగాణలో వసూలు చేసి ఢిల్లీకి తరలిస్తుందని సాక్షాత్తు మోడీ, అమిత్ షా నే తెలిపారన్నారు.

## బ్రాహ్మణుల సమస్యల
# పరిష్కారానికి కృషి

**విశ్వంభర, నారాయణఖేడ్ మే 24:** మండల బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని బ్రాహ్మణ సేవా సమాజం నియోజకవర్గ అధ్యక్షులు కిషన్ రావు దేశ్ పాండే, మండలాధ్యక్షుడు రామచంద్రాచారి అన్నారు. నారాయణఖేడ్ శివాలయంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశం, పెద్ద శంకరంపేట మండల బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ మండల గౌరవాధ్యక్షుడు కృష్ణ శర్మ, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, సభ్యులు సంతోష్ శర్మ, జగన్నాథరావు, గిరిధర్ రావు, సంగన్న, గుడి చంద్రశేఖర్ శర్మ, నాగరాజ్ శర్మ, ప్రభాకర్ రావు, డాక్టర్ ఫణిందర్, మహేష్ శర్మ, గిరి ప్రభాకర్ రావు తదితరులున్నారు.

## భార్యను సంసారానికి పంపడం లేదని మామపై హత్యయత్నం

**విశ్వంభర, జూబ్లిహిల్స్:** తన భార్యను ఇంటికి పంపటంలేదు అని మామ పై అల్లుడు హత్యాయత్నం చేసిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ , పాలకొల్లు ప్రాంతానికి చెందిన రామారావు (65) అనే వ్యక్తి కూతురుతో అల్లుడు సుబ్రహ్మణ్యం (30) కి వివాహం జరిగింది. వీరు ఇరువురు హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లోని యాదగిరి నగర్ లో నివాసం ఉంటున్నారు. అయితే కొన్ని రోజులుగా సుబ్రహ్మణ్యం భార్య పుట్టింటి దగ్గర నుండి సుబ్రహ్మణ్యం (అత్తింటికి) రావడంలేదని, ఆగ్రహానికి లోనైన సుబ్రహ్మణ్యం , భార్యని ఇంటికి పంపించటం లేదని తన మామ పై కోపం తో శుక్రవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో యాదగిరి నగర్ లోని మామ ఇంటికి వెళ్లి మామ రామారావు (65) పై బ్లేడ్ తో మెడ మీద కోసి, హత్యాయత్నంకి ప్రయత్నించాడు. అప్రమత్తం అయిన కుటుంబ సభ్యుల రాక తో రామారావుని ఆసుపత్రికి తరలించి, మధురా నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఉద్యోగులకు పోలింగ్ రోజున
# క్యాజువల్ లీవ్

- కలెక్టర్ హరిచందన దాసరి

**విశ్వంభర, నల్లగొండ మే 24 :** వరంగల్– ఖమ్మం– నల్గొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 27న ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇస్తున్నట్లు కలెక్టర్ హరిచంద్ర దాసరి ఓ ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రైవేటు యాజమాన్యాలు, వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక సంస్థల్లో పని చేసే పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలన్నారు.

**బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేదం**

ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ పరమైన బల్క్ ఎస్ఎంఎస్ లపై నిషేదం ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ –ఖమ్మం –నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికల పోలింగ్ ముగిసే 48 గంటల ముందు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు గాని, రాజకీయ పార్టీలు గానీ ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్ లు ఇవ్వకూడదని, ఒకవేళ ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్య తీసుకోబడుతుందని తెలిపారు.



## పోలింగ్ కేంద్రాల వద్ద
# 144 సెక్షన్

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**విశ్వంభర, వరంగల్ :** ఈ నెల 27న నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఓ ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈ నెల 27 తేదీ రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కావున కమిషనరేట్ పరిధిలోని ప్రజలు పోలీస్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

## అందుబాటులో
# సబ్సిడీపై విత్తనాలు

**విశ్వంభర, చింతపల్లి మే 24:** సబ్సిడీ పైన జీలుగ, జనుము విత్తనాలు అందజేస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీలక్ష్మి చెప్పారు. శుక్రవారం చింతపల్లి మండలంలో ఆమె రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పైన పచ్చి రొట్టెలు అందజేస్తుందని, ఈ పచ్చి రొట్ట పైరు వేసుకోవడం వలన భూసారం బాగా పెరుగుతుందని, చవుడు నేలల్లో వేసినట్లయితే చౌడు తగ్గిపోతుందని పేర్కొన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తో చింతపల్లి పీఏసీఎస్ కార్యాలయం, గ్రామాల్లోని రైతు వేదిక ఏఈఓలను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శ్రావణి కుమారి, పీఏసీఎస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 48 గంటలు వైన్స్, బార్స్ బంద్

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు.. తర్వాత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కూడా ముగిసింది. కానీ.. ఇంకా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. దీనికి కారణం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్యే ఉపఎన్నిక. ఈనెల 27న వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో జరగనుంది. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలో హెూరాహెూరీగా పోటీ పడుతున్నాయి. ఉపఎన్నిక బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు. కానీ ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ఉంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో కలిపి మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. అన్ని పార్టీలు అసెంబ్లీ ఎన్నికల రేంజ్‌లో ప్రచారం చేశాయి. ప్రధానంగా బీఆర్ఎస్ ఈ స్థానాన్ని గెలవడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. అయితే పరిస్థితులు మాత్రం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో పాటు.. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు వ్యక్తిగతంగా మంచి ఇమేజ్ ఉంది. దీంతో.. కాంగ్రెస్ గెలుపు ఖాయంగా కనిపిస్తోంది. ఇక పోలింగ్‌కు రెండు రోజులే సమయం ఉండటంతో ఈసీ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. ఉపఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల పోలింగ్ జరిగే మూడు జిల్లాల్లో వైన్స్ షాపులు, బార్లను బంద్ చేయాలని తేల్చి చెప్పింది. దీంతో 48 గంటల పాటు బార్లు, వైన్స్ మూతపడనున్నాయి. శనివారం సాయంత్రం 4.00 గంటల నుంచి 27న సాయంత్రం 4.00 గంటల వరకు బంద్ కానున్నాయి.





# ఆపరేషన్ కంబోడియా సక్సెస్

## 360 మంది ఇండియన్స్ సేఫ్

**విశ్వంభర, విశాఖపట్నం :** విశాఖ పోలీసులు నిర్వహించిన ఆపరేషన్ కంబోడియా సక్సెస్ అయింది. ఏపీ నుంచి వెళ్లి కంబోడియాలో చిక్కుకున్న భారతీయులకు విముక్తి లభించింది. ఉద్యోగాల కోసం ఏపీ నుంచి కంబోడియా వెళ్లి అక్కడ సైబర్ మోసానికి గురైయ్యారు. విశాఖ వాసులు కూడా ఇందులో ఉండటంతో ఈ విషయం బయటకు వచ్చింది. దీంతో.. విశాఖ పోలీసులు భారత ఎంబసీ అధికారులను సంప్రదించి ఆపరేషన్ కంబోడియా చేపట్టారు. దీనిపై కూపీ లాగగా 420 భారతీయులు కంబోడియాలో చిక్కకున్నట్టు గుర్తించారు. భారత ఎంబసీ సాయంతో 360 మందిని కంబోడియా పోలీసుల చెర కాపాడారు. ఎట్టకేలకు బాధితులు భారత్ చేరుకున్నారు. ఇందులో విశాఖకు చెందిన 60 మంది ఉన్నారు. కాగా.. కంబోడియాలో మంచి ఉద్యోగం, మంచి జీతం అంటూ ఆన్‌లైన్‌లో ఓ ప్రకటనను చూసి యువత అప్లైయ్ చేశారు. ఏపీ నుంచి ఏకంగా 150 మంది నిరుద్యోగులు ఈ ట్రాప్‌లో పడ్డారు. వారి నుంచి లక్షన్నర తీసుకొని.. బ్యాంకాక్, సింగపూర్ మీదుగా కంబోడియాకు తరలించారు. అక్కడ ఓ గ్యాంగ్ చైనా ముఠాకు అమ్ముకున్నారు. ఆ ముఠా నుంచి 4 వేల డాలర్లు తీసుకున్నారు. అయితే.. ఇలా ట్రాప్ అయిన వారిలో బొత్స శంకర్ అనే వ్యక్తి వారి నుంచి తప్పించుకొని వచ్చి విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హ్యూమన్ ట్రాఫికింగ్ బయటకు వచ్చింది.



# దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

**విశ్వంభర, ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ఓ కార్నివాల్ ఫామ్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అలిపూర్ ప్రాంతంలో ఉన్న ఆ కార్నివాల్ ఫామ్ హౌస్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగి చుట్టూరా వ్యాపించాయి. మంటల బాగా ఎగిసిపడుతుండగా చుట్టపక్కల దట్టమైన పొగ కమ్ముకుంది. ఘటన స్థలానికి అత్యంత సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. దీంతో అక్కడి నుంచి ప్రజలు పరుగులు పెట్టారు. కాగా విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# ప్రెగ్నెంట్ భార్య పొట్ట కోసిన భర్తకు జీవిత ఖైదు



**విశ్వంభర, లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఓ వ్యక్తి ఎనిమిది నెలల కడుపుతో ఉన్న భార్యకు పుట్టబోయే బిడ్డ జెండర్ తెలుసుకునేందుకు పొట్ట కోశాడు. ఈ ఘటనలో ఆమె ప్రాణాలతో బయటపడగా.. లోపలున్న మగబిడ్డ ప్రాణాలు కోల్పోయింది. వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రధేశ్‌లోని బదౌన్‌కు చెందిన పన్నాలాల్, అనిత దంపతులకు ఐదుగురు ఆడపిల్లలు. ఆమె మళ్లీ గర్భవతి కావడంతో ఈసారి మగబిడ్డను కనివ్వాలని అనితతో అతడు గొడవ పడ్డాడు. లోపల ఎవరున్నారో చూస్తానంటూ ఆమె పొట్ట కోశాడు. దీంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. ఆమె ప్రాణాలతో బయటపడింది. అయితే, లోపలున్న మగబిడ్డ మృతిచెందింది. కాగా, ఈ ఘటనలో బదౌన్ కోర్టు ఐపీసీ 307, 313 సెక్షన్‌ల కింద పన్నాలాల్‌కు జీవితఖైదు విధించింది.వ్యాపించాయి. మంటల బాగా ఎగిసిపడుతుండగా చుట్టపక్కల దట్టమైన పొగ కమ్ముకుంది. ఘటన స్థలానికి అత్యంత సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. దీంతో అక్కడి నుంచి ప్రజలు పరుగులు పెట్టారు. కాగా విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.



# భారీగా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

**విశ్వంభర, ఆదిలాబాద్ :** ముందుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో గల రామ్‌నగర్ ఏరియాలో 19 లక్షల విలువ గల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం తమకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు నకిలీ విత్తనాల తయారీ నిర్వహిస్తున్నారని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేయగా దాదాపు 400 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు, వాటి విలువ దాదాపు 19 లక్షల రూపాయలు ఉంటాయని తెలియజేశారు. వ్యవసాయ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ నకిలీ పత్తి విత్తనాల వ్యవహారం ప్రధానంగా ముగ్గురు నిర్వహిస్తున్నారని, వారిలో సామా అశోక్ రెడ్డి,ఎ రాజేందర్, కాపార్తి మణికంఠ ( పరారీ)లో ఉన్నట్లు తెలిపారు. వీరి ముగ్గురు కలిసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారని, వీరు ఆదిలాబాద్ పట్టణంలో మీనాక్షి గోల్డ్, పాండు రంగ, పుడమి 16, వైట్ గోల్డ్ అనే కంపెనీల కు సంబంధించిన నకిలీ విత్తనాలను తయారు చేస్తుంటారని తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతుందని వీరందరితో సంబంధం ఉన్న వారిపై కూడా కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. మావల పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదు చేయబడిందని తెలిపారు.

# ఘనంగా వాసవి మాత కన్యకా పరమేశ్వరి జయంతి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** వాసవిమాత కన్యకాపరమేశ్వరి జయంతోత్సవ వేడుకలు ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రొద్దటూరు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఆర్కేపురం లోని వైష్ణవి కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, అమరావధి లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్త లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కుల దైవం వాసవి మాత జయంతిని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ పూజ కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళమణులతో అభిశేకము , కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి జ్యువెలర్స్ అధినేత ఇమ్మడి రమేష్, ఆర్కే పురం ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీలు నాగేంద్రయ్యా , శ్రవణ్ కుమార్ , కోశాధికారి అరవేటి వేణు మాధవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్ , రామిని సద్గుణ , లక్ష్మి సుబ్రమణ్యం, శ్రీలత, నాచం లక్ష్మి , వాణి శ్రీ, గంధం పద్మ హాజరయ్యారు.

# బీఆర్ఎస్‌లో మిగిలేది కేసీఆర్ కుటుంబమే : తీన్మార్ మల్లన్న

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎన్నికల ప్రచారం జోరుగా చేస్తున్నారు. గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నా.. ఏ మాత్రం ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా ప్రచారం చేస్తున్నారు. అన్ని వర్గాలను కలుపుకొని పోతున్నారు. కమ్యూనిస్టులు ఇప్పటికే మల్లన్నకు మద్దతు పలికారు. ఇవాళ సీపీఎస్ ఉద్యోగులు కూడా మల్లన్న వైపే మొగ్గు చూపారు. కాగా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పై విరుచుకుపడ్డారు. రాజీనామా చేసిన స్థానం నుంచి బీఆర్ఎస్ మళ్లీ ఎందుకు పోటీ చేస్తుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పోటీ చేయాలనుకున్నపుడు ఎందుకు రాజీనామా చేశారని ప్రశ్నించారు. ఉద్యోగులకు కానీ.. నిరుద్యోగులకు కానీ.. బీఆర్ఎస్ హయాంలో గౌరవం లేదని అన్నారు. విద్యార్థులను, నిరుద్యోగులను అసలు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఉస్మానియా, జేఎన్టీయూ, కాకతీయ విద్యార్థులను కేటీఆర్ ఘోరంగా అవమానించారని విమర్శించారు. కాబట్టి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని గ్రాడ్యుయేట్స్‌కు తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చరిత్రలో కలిసిపోయినట్టేనని అన్నారు. ఆ పార్టీకి ఇంకా భవిష్యత్ లేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ఖాళీ అవ్వడం ఖాయమని మల్లన్న జోస్యం చెప్పారు. ఆ పార్టీలో కల్వకుంట్ల కుటుంబం తప్పా మిగిలిన వారంతా వేరే దారి చూసుకుంటారని చెప్పారు. ఇక కల్వకుంట్ల కుటుంబం కూడా తెలంగాణలో ఉండదని.. జైలుకు వెళ్లిపోతుందని మల్లన్న అన్నారు. మల్లన్న కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారాయి.



# తీన్మార్ మల్లన్నను గెలిపించాలి : మేదరమెట్ల

**విశ్వంభర, కోదాడ మే 24:** ఇండియా కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్లో శుక్రవారం సీపీఎం నియోజకవర్గ సమావేశంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మేదర మెట్ల వెంకటే శ్వరరావు హాజరై మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వరక సభ్యుడు మట్టిపల్లి సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు, ఎం ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య, బెల్లంకొండ సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శిలు రాపోలు సూర్యనారా యణ, నాగటి చిన్నరాములు, అలస గాని బ్రహ్మయ్య, టౌన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సీఎం.. లోకేష్ పార్టీ చీఫ్ : బుద్దా వెంకన్న



**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో పోలింగ్ ముగిసి పది రోజులు దాటినా.. ఇంకా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. దానికి కారణం ఇంకా ఫలితాలు విడదల కాకపోవడమే. మరో 10 రోజుల్లో ఫలితాలు విడుదలవుతాయి. పార్టీలతో పాటు ప్రజల్లో కూడా ఏపీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. బయటకు అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నా.. ప్రతీ నాయకుడిలోనూ ఎదో టెన్షన్ కనిపిస్తోంది. ఈసారి ఎన్నికలు గతంలో ఎప్పుడూ లేని విధంగా హెూరాహెూరీగా జరిగాయి. దీంతో.. ఫలితాలను ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. అయితే.. ఎవరికి వారు ధీమావ్యక్తం చేస్తున్నారు. మరో 10 రోజుల్లో రిజల్ట్స్ రానున్న నేపథ్యంలో టీడీపీ నేత బుద్దా వెంకన్న కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన ఆయన.. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తార ని అన్నారు. అదే రోజు లోకేష్ కు పార్టీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. నారా లోకేష్‌కు పార్టీని నడిపించే సత్తా ఉందని బుద్దా వెంకన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో అన్ని వర్గాలు లోకేష్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రజలకు లోకేష్ నాయకత్వంపై నమ్మకం వచ్చిందని అన్నారు. చంద్రబాబు అమరావతిలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని బుద్దా వెంకన్న చెప్పారు. ఎన్డీఏ కూటమి 130కి స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాదు.. చంద్రబాబు ఆత్మకథ రాస్తే.. అందులో తనకు కూడా పేజీ ఉంటుందని బుద్దా అన్నారు. తన రక్తంతో చంద్రబాబు పాదాల కడిగానని చెప్పారు.



– మాధవశేషు స్వామి,
వాస్తు, జ్యోతిష్యం
పురోహిత్, సెల్:
9059308808

# రాశి ఫలాలు

**19-05-2024 నుండి 25-05-2024 వరకు**



**మేష రాశి :** ఈ వరం విశేషంగా ఉన్నదని చెప్పవచ్చు. కార్య ఆటంకాలు కలిగిననూ సంపూర్ణంగా పనులు పూర్తి చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.

**వృషభ రాశి :** రాజ యోగంగా ఉన్నది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయాలు కొంత చికాకు కల్గిననూ వారం చివరన పూర్తి అవుతాయి. సోదర, బందు వర్గము నుండి విశేష సహకారం అందుకొందురు.





**మిథున :** శ్రమ చేత ఫలితాన్ని సాధించగలరు. కుతుమ్బామున మాట విలువ తగ్గుతుంది. ఆర్థిక విషయాలు చికాకు కల్గిస్తాయి. కోర్టు, శత్రు కార్యాలు పరిష్కారం అగును.

**కర్కాటక :** గడ్డుకలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి రెండు సార్లు తిరగవలసి వచ్చును. వాహనం నడుపుటలో జాగ్రత్త అవసరం.





**సింహరాశి :** సామాన్యంగా ఉన్ననూ అనుకున్న కోర్కెలను తీర్చుకుంటారు. కుటుంబ ఆర్థిక విషయాలు మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు ఏర్పడుతాయి. శారీరక శ్రమ అధికముగా చేయటం వల్ల శిరోవ్యాధి అధికమగును.

**కన్యారాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధను తీసుకొని జీవనాన్ని సాగించవలెను. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని అనుభవించ వలసి వస్తుంది. ఆర్థిక విషయాలు సామాన్యంగా ఉండును. సంతానం ద్వారా ధన నష్టం కల్గును.






**తులరాశి :** అనుకునంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. గతంలో ఉద్యోగం లేనివారికి ఈ వరం ఉద్యోగం లభించును. పుత్ర సంతానం వలన ప్రగతిని సాధిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా నిర్వహిస్తారు.

**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచ్చు. నూతన వస్తు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడి ఎడబాటు కల్గును. అభివృద్ధిలో ఆటంకాలు ఉన్ననూ అందరి మన్ననలతో ముందుకు సాగుతారు.






**ధనుస్సురాశి :** విశేష యోగావంతంగా ఉండును. తలచిన వెంటనే పనులు పూర్తి చేయుదురు. విదేశీ ప్రయాణాలు లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగావంతంగా ఉండును. భాగస్వామ్య వ్యాపారాలు సొంత నిర్ణయంతో చేసుకొనుట మంచిది.

**మకరరాశి :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారానికి ఆలోచిస్తారు. భార్య అనారోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన కాగితాలు, డబ్బు మర్చిపోదురు. బంధు వర్గం వారితో జాగ్రత అవసరం. విరోధం ఏర్పడును.





**కుంభరాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసట ఉండును. కుటుంబ, ఆర్థికంగా అలోచించి ముందుకు సాగుతారు. పుత్ర సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం స్నేహితులకు డబ్బులు బదులు ఇచ్చినచో తిరిగి రావు.

**మీనరాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడ లేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకులు కల్గిన్చిననూ నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.







# సత్యభామ కుమ్మేసిందిగా..

**విశ్వంభర, సినిమా :** చందమామ కాజల్ అగర్వాల్ నటిస్తున్న మూవీ సత్యభామ. సుమన్ చిక్కాల దర్శకత్వంలో తెరకెక్కుతోంది. మొదటి సారి కాజల్ చేసిన లేడి ఓరియొంటెడ్ మూవీ ఇది. ఈ చిత్రంలో కాజల్ పోలీసాఫీసర్‌గా నటిస్తోంది. నవీన్ చంద్ర కీలక పాత్రను పోషిస్తుండగా అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. ప్రకాష్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 7 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ తో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాల్లో వేగం పెంచింది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని ఐటీసీ కోహెనూర్‌లో ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. నందమూరి అందగాడు, స్టార్ హీరో బాలయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశాడు.


# '96' మూవీ ఫేమ్ దర్శకుడితో కార్తీ



**విశ్వంభర, సినిమా :** తమిళ స్టార్ హీరో కార్తీ 96 ఫేమ్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నాడు. అరవింద స్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కార్తీ కెరీర్‌లో 27వ సినిమాగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ మూవీకి 'మెయ్యళగన్' అనే పేరును ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అరవింద్ స్వామి సైకిల్‌ను నడుపుతుండగా వెనుక కూర్చున్న కార్తీ సంతోషంలో మునిగిపోయినట్లుగా కనిపిస్తోంది. మొత్తంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీతాన్ని అందిస్తుండగా 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్య జ్యోతిక నిర్మిస్తున్నారు. రాజ్ కిరణ్, శ్రీదేవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# బాయ్ ఫ్రెండ్‌తో బ్రేక్ అప్

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్ హీరోయిన్ శ్రుతిహాసన్ తన బాయ్‌ఫ్రెండ్‌తో విడిపోయినట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై శ్రుతి క్లారిటీ ఇచ్చింది. ఇన్‌స్టా వేదికగా 'ఆస్క్ మీ ఎనిథింగ్' పేరిట ఫాలోవర్స్‌తో ముచ్చటించిన శ్రుతి తన రిలేషన్ స్టేటస్ గురించి మాట్లాడింది. ఓ నెటిజన్ 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా' అని అడిగిన ప్రశ్నకు.. 'నాకు ఈ తరహా ప్రశ్నలు నచ్చవు. కానీ, చెబుతున్నాను. ఇప్పుడు



నేను సింగిల్ రెడీ టు మింగిల్ అంటూ తన బాయ్ ఫ్రెండ్ శాంతనుతో బ్రేకప్పు కన్ఫామ్ చేసేసింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికతో శ్రుతి హాసన్ ప్రేమలో ఉన్నట్లు నాలుగేళ్ల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. అతడితో దిగిన ఫొటోలను తరచూ పోస్ట్ చేస్తూ ఉండేది. కొన్ని నెలలుగా ఆమె ఎలాంటి ఫొటోలను షేర్ చేయకపోవడమే గాక ఇన్స్టాలో వీళ్లిద్దరు ఒకరినొకరు అన్ఫాలో చేయడం, కలిసి ఉన్న ఫొటోలు డిలీట్ చేయడంతో బ్రేకప్ అయిందని నెట్టింట వార్తలు వచ్చాయి. తాజాగా ఇదే విషయంపై శ్రుతి క్లారిటీ ఇచ్చింది.

# విశ్వంభరలో చిరుతో ఐదుగురు హీరోయిన్లు!

మెగాస్టార్ చిరంజీవి ఏడు పదుల వయసులో కూడా తెలుగు సినీ ఇండస్ట్రీకి ఐకాన్ లా ఉంటారు. వయసు పెరిగే కొద్ది ఆయనలో క్రేజ్ పెరుగుతోంది తప్పా తగ్గడం లేదు. ఇటీవలే పద్మ విభూషణ్ అందుకున్న ఆయన వరుస సినిమా షూటింగ్‌లతో రెడీ అవుతున్నారు. చిరంజీవి నటించిన విశ్వంభర త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. వశిష్ఠ డైరెక్షన్‌లో రాబోతున్న ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీంతో.. స్టాలిన్ కాంబోను మెగా ఫ్యాన్స్ గుర్తు చేసుకుంటున్నారు. త్రిష ఇప్పటికే షెట్స్ పైకి వెళ్లారు. షూటింగ్ ఫోటోలు కూడా బయటకు వచ్చాయి. అయితే, ఇప్పుడు ఈసినిమాకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఫిల్మినగర్‌లో వైరల్ అవుతోంది. చిరు సరసన త్రిషతో పాటు.. మరో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారని టాక్ నడుస్తోంది. వారి పేర్లు కూడా బయటకు వచ్చాయి. ఆషికా రంగనాథ్, మీనాక్షీ చౌదరి, సురభి, ఈషా చావ్లా కూడా విశ్వంభరలో ఉన్నారని అంటున్నారు. అయితే, త్రిష మెయిన్ రోల్‌లో ఉంటారని .. మిగిలిన వాళ్లు సపోర్టింగ్ క్యారెక్టర్లుగా ఉంటారని తెలుస్తోంది. అయితే.. ఆ నలుగురికి కూడా మంచి పాత్రలే దక్కాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇక ఈ వార్తపై సోషల్ మీడియాలో రకరకాలుగా కామెంట్స్ వస్తున్నాయి. మెగా ఫ్యాన్స్ మాత్రం ఓ రేంజ్‌లో సంబరాలు చేస్తున్నారు. ఏజ్ పెరిగే కొద్ది బాస్‌కి క్రేజ్ పెరుగుతోందని కామెంట్స్ చేస్తున్నారు. కానీ.. యాంటీ ఫ్యాన్స్ మాత్రం దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. ఇంతమంది హీరోయిన్స్‌తో ఉమెన్స్ హాస్టల్ నడిపిస్తాడా? అని సెటైర్లు వేస్తున్నారు. మరికొంతమంది అయితే.. హిట్లర్ సీక్వెల్ తీస్తున్నాడా? అని అంటున్నారు. మొత్తానికి ఎవరి క్యారెక్టర్ ఏంటో తేలాలంటే మరి కొన్ని రోజులు ఆగాల్సిందే.



# రాజస్థాన్‌పై ఘన విజయం

## ఫైనల్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్ హైదరాబాద్

## కోల్ కత్తా నైట్ రైడర్స్ తో ఫైనల్ ఫైట్ కు సిద్ధం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2024లో భాగంగా చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన కీలక క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. 36 పరుగులు తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సన్‌రైజర్స్ తుది పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది.176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 139 పరుగులే చేసింది. ఆర్‌ఆర్ బ్యాటర్లు తడబడ్డారు. యశస్వి జైశ్వాల్(42), ధ్రువ్ జురెల్ (56 నాటౌట్) రాణించారు. టామ్ కోహ్లెర్(10), కెప్టెన్ సంజూ శాంసన్(10), రియాన్ పరాగ్(6), సిమ్రాన్(4), రోవ్మన్ పోవెల్ (6) పరుగులు చేశారు. ఎస్‌ఆర్‌హెడ్ బౌలర్లలో షాబాజ్ అహ్మద్ 3 వికెట్ల ప్రదర్శన చేశాడు. అభిషేక్ శర్మ పాట్, కమిన్స్, నటరాజన్ తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఎస్‌ఆర్‌హెచ్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్(34 బంతుల్లో 4 సిక్స్‌ల సాయంతో 50) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాహుల్ త్రిపాఠి(15 బంతుల్లో 5 ఫోర్లు 2 సిక్స్‌ల సాయంతో 37), ట్రావిస్ హెడ్(28 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్ సాయంతో 34) పరుగులతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అభిషేక్ శర్మ(12), నితీశ్ రెడ్డి(5), మారక్రమ్(1), అబ్దుల్ సమద్(0) నిరాశ పరిశారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన షాబాజ్ అహ్మద్(18) పరుగులు చేశాడు. ఇక రాజస్థాన్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, అవేష్ ఖాన్ తలో మూడు వికెట్లు పడగొట్టారు. సందీప్ శర్మ రెండు వికెట్లు దక్కించుకున్నారు.

# టీమిండియా హెడ్ కోచ్ పదవిపై స్పందించిన జై షా

- టీమిండియా కోచ్ గా కొనసాగేందుకు ద్రావిడ్ విముఖత
- కొత్త కోచ్ కోసం దరఖాస్తులకు ఆహ్వానం
- తనను కోచ్ గా రమ్మన్నారని, తాను నో చెప్పాన్న పాంటింగ్
- టీమిండియా కోచ్ పదవిలో రాజకీయాలు ఉంటాయన్న జస్టిన్ లాంగర్
- ఆ విషయం తనకు కేఎల్ రాహుల్ చెప్పాడన్న లాంగర్
- కోచ్ గా రావాలని తాము ఎవరినీ అడగలేదన్న జై షా



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా హెడ్ కోచ్‌గా కొనసాగేందుకు రాహుల్ ద్రావిడ్ ఆసక్తి చూపకపోవడంతో బీసీసీఐ కొత్త కోచ్ కోసం వేట మొదలుపెట్టింది. అయితే, టీమిండియా కోచ్ పదవి కోసం తనను సంప్రదించారని, అయితే ఆ ఆఫర్ ను తాను తిరస్కరించానని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ చెప్పాడు. ఇక, ఆసీస్ మాజీ ఓపెనర్ జస్టిన్ లాంగర్ మరో అడుగు ముందుకేసి, టీమిండియా ఆటగాడు కేఎల్ రాహుల్ తన కళ్లు తెరిపించాడని వ్యాఖ్యానించాడు. టీమిండియా హెడ్ కోచ్ పదవి అంటే అనేక రాజకీయాలు ఉంటాయని కేఎల్ రాహుల్ చెప్పాడని, ఆ పదవిని తాను కోరుకోవడంలేదని అన్నాడు. ఈ విధంగా మీడియాలో పలు కథనాలు వస్తున్న నేపథ్యంలో, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షా స్పందించారు. టీమిండియా కోచ్ గా రావాలంటూ బీసీసీఐ తరపున ఎవరూ కూడా ఆసీస్ మాజీ క్రికెటర్లను సంప్రదించలేదని జై షా స్పష్టం చేశారు. తామే ఆసీస్ మాజీ క్రికెటర్లను అడిగామంటూ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని అన్నారు. భారత క్రికెట్ వ్యవస్థను సమూలంగా అర్థం చేసుకోగలిగే వ్యక్తి మాత్రమే టీమిండియా హెడ్ కోచ్ గా ఎంపికవుతాడని జై షా వెల్లడించారు. భారత జట్టుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ, భారత క్రికెట్ చరిత్ర, భారత క్రికెట్ ఔన్నత్యం, ఆట పట్ల టీమిండియా, బీసీసీఐ అంకితభావం... వీటన్నింటిపై అవగాహన ఉన్న వ్యక్తి మాత్రమే టీమిండియా హెడ్ కోచ్ పదవికి అర్హుడని జై షా స్పష్టం చేశారు. అలాంటి వ్యక్తి కోసమే తాము అన్వేషిస్తున్నామని చెప్పారు. అందు వల్లే టీమిండియా కోచ్ ఎంపిక ఓ క్లిష్టమైన ప్రక్రియగా ఉంటోందని తెలిపారు. టీమిండియా హెడ్ కోచ్ పదవి కంటే అంతర్జాతీయ క్రికెట్లో మరో ఆకర్షణీయమైన పదవి ఉంటుందని తాను అనుకోవడంలేదని అన్నారు.



# ఐపీఎల్ ఆల్‌టైమ్ రికార్డు దిశగా రియాన్ పరాగ్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 17వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు రియాన్ పరాగ్ చెలరేగి ఆడుతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లు ఎవరైనా సరే దంచికొడుతూ నిలకడగా పరుగులు సాధిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటి వరకు 15 మ్యాచులు ఆడిన అతడు 567 పరుగులు చేశాడు. రెండో క్వాలిఫయర్‌లో శుక్రవారం చెపాక్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ క్రమంలో రియాన్ పరాగ్ అరుదైన రికార్డు సాధించే అవకాశం ఉంది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో పరాగ్ మరో 59 పరుగులు చేస్తే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ గా చరిత్ర సృష్టించనున్నాడు. ప్రస్తుతం ఈ రికార్డు యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. 2023 ఐపీఎల్ సీజన్‌లో జైస్వాల్ 625 పరుగులు చేశాడు. వీరిద్దరి కంటే ముందు అ రికార్డు షాన్ మార్ష్ పేరిట ఉండేది. 2008లో 11 మ్యాచుల్లో పంజాబ్ కింగ్స్ తరుపున మార్ష్ 616 పరుగులు చేశాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com